విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :98 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 28 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# మరో ఘోరం



- పల్నాడులో ఆటోను ఢీకొట్టిన బస్సు.. ఏడుగురు మృతి
- పుట్టిన రోజు వేడుకలకు ఆటోలో వెళ్లి వస్తున్న
- ఒకే గ్రామానికి చెందిన 15 మంది
- చిలకలూరిపేటలో ఢీకొట్టిన ప్రైవేటు బస్సు
- మృతుల్లో ఆరుగురు మహిళలు..
- నలుగురు చిన్నారులు సహా 8 మందికి గాయాలు
- బాధితులంతా ఒకే గ్రామానికి చెందిన బంధువులు




## ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ

- పుతిన్‌తో కీలక భేటీ
- భారత్, రష్యా సంబంధాలపై చర్చ
- నాలుగు రోజుల పాటు రెండు దేశాల్లో పర్యటించనున్న ప్రధాని మోదీ
- బిష్కెక్‌లో 26వ షాంఘై సహకార సంస్థ సదస్సుకు హాజరు

## అందరినీ క్షేమంగా తేవడమే

# మన ప్రాధాన్యం

- కేంద్రం, ఎంబసీలతో టచ్‌లో ఉండండి: బాబు
- మానస సరోవర్ యాత్రకు వెళ్లి అక్కడ చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలి
- ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి
- కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదు



అమరావతి

నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. మానస సరోవర్ యాత్రకు వెళ్లి అక్కడ చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని గురువారం అధికారులను ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలన్నారు. రహదారి, విమాన మార్గాలతో పాటు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షితంగా తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కష్టాల్లో ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు వివరాలు 2లో..



## రూ.1,430 కోట్లతో అభివృద్ధి పనులు

- రూ.596 కోట్లతో లైబ్రరీ
- కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు
- సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం


అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి, మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులుగా బీటీ రోడ్లుగా నిర్మించేందుకు, 29 గ్రామాల లేఅవుట్ రోడ్లను బీటీగా అభివృద్ధి చేసేందుకు ఆమోదం లభించినట్లు వివరించారు. అమరావతి నుంచి మంగళగిరికి తాగునీరు అందించేందుకు వివరాలు 2లో..



# వెలుగుల వెలిగొండ

- నెరవేరనున్న 30 ఏళ్ల కల.. కరువు నేలకు కృష్ణమ్మ
- ఈ నెల 31న ప్రాజెక్టు జాతికి అంకితం
- తీరనున్న మార్కాపురం జిల్లావాసుల కష్టాలు
- ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకూ లబ్ధి
- కరువు కాటకాలు, ఫ్లోరైడ్ సమస్యలకు చెక్
- అంచనా వ్యయం 10,200 కోట్లు
- సామర్థ్యం 53.85 టీఎంసీలు
- మొత్తం 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు
- 23 లక్షల మందికి తాగునీరు సరఫరా
- 1996లో నాటి సీఎం చంద్రబాబు భూమిపూజ
- ఇప్పుడు ప్రారంభించేదీ ఆయనే
- ప్రాజెక్టు పనులను అపహాస్యం చేసిన వైసీపీ
- జగన్ పాలనలో 140 కోట్ల బిల్లులు పెండింగ్
- పైగా జాతికి అంకితం అంటూ మోసం




అమరావతి

మూడు దశాబ్దాల కల నెరవేరబోతోంది. కరువు నేలపై కృష్ణమ్మ పరవళ్లు తొక్కే సమయం ఆసన్నమైంది. తమ జీవితాల్లో వెలుగులు నింపే వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు ప్రారంభానికి సిద్ధం కావడంతో ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోతోంది. ఇంతటి బృహత్తర ప్రాజెక్టు పూర్తి కావడానికి కారకుడు నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు కావడం విశేషం. 1996లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం చంద్రబాబు.. ఈ నెల 31న జాతికి అంకితం చేయనున్నారు. ప్రాజెక్టు తొలిదశ పనులు పూర్తి కావడంతో కృష్ణమ్మ నీళ్లు నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు తెచ్చే శుభ ఘడియల కోసం ప్రజానీకం ఎదురుచూస్తోంది. ప్రకాశం, మార్కాపురం, వివరాలు 2లో..



## భారత అథ్లెట్ల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందా

- 2036 ఒలింపిక్స్‌కు సిద్ధమవ్వాలి: మోదీ
- డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడటంలో క్రీడల పాత్ర కీలకమని వ్యాఖ్య
- 2036 ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే అథ్లెట్లను సిద్ధం చేయాలని పిలుపు

# నేపాల్ వరద విధ్వంసం

- 359కి చేరిన మృతుల సంఖ్య
- 288 మంది భారతీయులు గల్లంతు
- నేపాల్ వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతైనట్లు తెలిపిన విదేశాంగ శాఖ
- టిబెట్‌లోని మరో 200 మంది భారతీయులు భారత్ సాయం కోరినట్లు వెల్లడి
- 359 మంది మృతి

హైదరాబాద్

నేపాల్‌లో ఆకస్మిక వరదల్లో మృతిచెందిన వారి సంఖ్య గంటగంటకూ పెరుగుతోంది. మృతుల సంఖ్య 359 దాటినట్లు నేపాల్ పోలీసులు ప్రకటించారు. 910 మంది ఆచూకీ గల్లంతైంది. గల్లంతైన వారిలో 288 మంది భారత పర్యటకులు ఉన్నారు. ఉప్పెనలా వరద, బురద ముంచెత్తడంతో వేలాది ఇళ్లు, పలు వంతెనలు నామరూపాల్లేకుండా పోయాయి. అనేక చోట్ల భారీ ఎత్తున బురద మేట వేసింది. సమాచార వ్యవస్థ దెబ్బతినడంతో వివరాలు 2లో..

## పంచదార్ల కొండపైతవ్వకాలు బంద్!



- నో మైనింగ్ జోన్‌గా ప్రకటించిన ప్రభుత్వం
- ఆలయాల పరిరక్షణకు నిర్ణయం
- ఇప్పటికే ఇచ్చిన గ్రావెల్ లీజులు పనిచేయవు
- భవిష్యత్‌లోనూ అనుమతులివ్వరు
- ఉత్తర్వులు జారీచేసిన గనుల శాఖ

# మరో ఘోరం

**చిలకలూరిపేట/బెళుగుప్ప** వారందరిదీ ఒకే గ్రామం.. అంతా బంధువులు. చిన్నారి పుట్టినరోజు వేడుకకు వెళ్లారు. రోజంతా సంతోషంగా గడిపారు. ఆనందంగా పుట్టినరోజు వేడుక చేసుకున్నారు. ఆ తర్వాత ఆటోలో స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. కాసేపట్లో గ్రామానికి చేరుకోవాల్సిన సమయంలో ఊహించని ఘోరం జరిగింది. ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన చవుటుపల్లి లక్ష్మమ్మ చెల్లెలు పలకలూరు సుబ్బులమ్మ ప్రకాశం జిల్లా జే పంగులూరు మండలం కొండ మంజులూరులో ఉంటోంది. సుబ్బులమ్మ మనవడు మరియబాబు కుమార్తె నక్షత్ర తొలి పుట్టినరోజు వేడుకలు బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ వేడుకకు వేలూరు నుంచి బంధువులు 15మంది ఆటోలో వెళ్లారు. రాత్రి పొద్దుపోయే వరకు వేడుకలో పాల్గొన్నారు. విందు భోజనాలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. చిలకలూరిపేటకు చేరుకుని.. పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్ నుంచి వేలూరు వెళ్లేందుకు ఆటో మలుపు తిరుగుతుండగా విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న వరుణ్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. బస్సు బలంగా ఢీకొట్టడంతో ఆటోలోనివారు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతుల్లో చవుటుపల్లి లక్ష్మమ్మ(75), ఆమె కోడలు సువార్త(45), కుమార్తె బొంతా గంగమ్మ(50), భార్యాభర్తలు బొంత బాబురావు(62), మణెమ్మ (55), వరుసకు అత్తా కోడళ్లు బొంత సంపూర్ణమ్మ (70), బొంత మరియమ్మ(50) ఉన్నారు. ఈ ప్రమాదంలో నలుగురు చిన్నారులు బొంత పల్లవి, తాళ్లూరి అభిరామ్, బొంత శ్యామేల్‌రాజు, బొంత దివ్య.. మరో నలుగురు చవుటుపల్లి ధనమ్మ, చవుటుపల్లి సబ్బులమ్మ, వెంకాయమ్మ, ఆటో డ్రైవర్ బొంత ఆరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చిలకలూరిపేట, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

### స్వగ్రామంలో శోకం..

ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు చనిపోవడంతో వేలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతులందరూ వ్యవసాయ కూలీలు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు,




ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు.. చిలకలూరిపేట ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించారు. ప్రైవేట్ ట్రావెల్స్‌తో మాట్లాడి తగిన పరిహారం అందించేలా చూడాలని అధికారులను పుల్లారావు కోరారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వం తరఫున తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఎంపీ లావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ బాధిత కుటుంబ సభ్యులను, అధికారులను అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద ఘటనపై చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

### నిర్లక్ష్యం బలి తీసుకుంది!

ఆటో, బస్సు డ్రైవర్లు కొంచెం జాగ్రత్త వహించినా ప్రమాదం జరిగి ఉండేది కాదని తెలుస్తోంది. అడ్డరోడ్డులో ఆటో మలుపు తిరిగే సమయంలో బస్సు ఆటోను ఢీకొట్టింది. డ్రైవర్లిద్దరూ అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే ప్రమాదం జరిగేది కాదని తెలుస్తోంది. అతివేగంతో దూసుకెళ్లే ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

చిలకలూరిపేట ఘోర రోడ్డుప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పవన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారి ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ చిలకలూరిపేట దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు.

# వెలుగుల వెలిగొండ

-మొదటిపేజీ తరువాయి

నెల్లూరు, కడప జిల్లాల్లో తక్కువ వర్షపాతంతో నిత్యం కరువు కాటకాల సమస్యలకు పరిష్కారంచూపడంతో పాటు సురక్షిత తాగునీరు లేని ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాల విముక్తి కోసం రూపకల్పన చేసిన ప్రాజెక్టు వెలిగొండ. శ్రీశైలం నుంచి కృష్ణా వరద నీటిని నల్లమల కొండల కింద నిర్మించిన రెండు సొరంగాల ద్వారా నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు తరలించి 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. అంతేకాకుండా నల్లమల సాగర్ రిజర్వాయర్‌ను నీటితో నింపడం వల్ల సమీప ప్రాంతాల్లో ప్రస్తుతం 30 నుంచి 60 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు పెరిగి 6 మీటర్లలోనే అందుబాటులోకి రానున్నాయి.

### శంకుస్థాపన చేసింది చంద్రబాబే

1985లోనే వెలిగొండ ప్రాజెక్టు ఆలోచన మొదలైనప్పటికీ 1994లో దీనికి సంబంధించిన డీపీఆర్ పూర్తయ్యింది. 1996 మార్చి 5న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నల్లమల కొండల శ్రేణిగా పిలిచే వెలిగొండల శ్రేణిలో గ్యాప్‌లను పూడ్చటం ద్వారా రిజర్వాయర్ పూర్తి చేయాలనేది ప్రణాళిక. 1998లోనే సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.138 కోట్ల పరిపాలన అనుమతులు వచ్చాయి. అనంతరం కాకర్ల డ్యాంకు కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఆనకట్టల నిర్మాణం పూర్తయి 53.85 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ రూపుదిద్దుకుంది. దోర్నాల మండలం కొత్తూరు వద్ద సొరంగాలు ఉన్న ప్రాంతం నుంచి దాదాపు 22 కి.మీ దూరంలో ఉన్న నల్లమల సాగర్‌కు ఫీడర్ కాలువ ద్వారా నీటిని తరలిస్తారు. ఈ రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువల ద్వారా నిర్దేశిత ప్రాంతాలకు నీటిని అందిస్తారు.

### పనుల్లో జాప్యంతో పెరిగిన అంచనా వ్యయం

2004లో టన్నెల్-1, 2009లో టన్నెల్-2 పనులు ప్రారంభమైనప్పటికీ తవ్వకాల సమయంలో ఏర్పడిన అవాంతరాల కారణంగా జాప్యం జరిగింది. టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ యంత్రం ఇరుక్కుపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. 2014కు ముందు సరైన ప్రణాళిక లేకుండా చేసిన పనుల వల్ల కాలవ్యవధితో పాటు ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా పెరిగిపోయింది. 1996లో రూ.980 కోట్లతో ప్రారంభమైన అంచనా వ్యయం ఇప్పుడు రూ.10,200 కోట్లకు చేరింది. టన్నెల్ నిర్మాణాలు పూర్తికాకుండానే కాలువల తవ్వకం పనులు చేయడం, నిర్వాసితుల సమస్య వదిలేయడం వంటి చర్యలతో 2014కు ముందు కేవలం మట్టి తవ్వకం పనులపైనే శ్రద్ధ చూపారు. ప్రధాన కాలువ తవ్వకం కూడా పూర్తి చేయకపోగా, బ్రాంచ్ కాలువ, మేజర్, మైనర్ కాలువల నిర్మాణం చేపట్టలేదు. ఫీడర్ కాలువ పూర్తి చేసినట్టు మట్టి పనులతో చేతులు దులుపుకోవడంతో వర్షం కురిసినప్పుడు వచ్చిన వరద నీటికే ఫీడర్ కాలువకు నాలుగైదు చోట్ల గండ్లు పడ్డాయి.

### చంద్రబాబు హయాంలోనే పనుల్లో వేగం

2014 జూన్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచారు. ఐదేళ్ల కాలంలో రూ.1,388.81 కోట్ల పనులు పూర్తి చేశారు. 18.8 కి.మీ పొడవున్న టన్నెల్-1లో అప్పటికి బ్యాలెన్స్ ఉన్న 7.2 కి.మీల తవ్వకంలో 2019 నాటికి 4.3 కి.మీ పూర్తి చేశారు. టన్నెల్-2లో 10 కి.మీ తవ్వాల్సి ఉంటే అందులో 2019 నాటికి 2.3 కి.మీ పూర్తి చేశారు. 2024లో మళ్లీ సీఎంగా పగ్గాలు చేపట్టాక కేవలం రెండేళ్ల రెండు నెలల్లో రూ.2,402 కోట్ల పనులు పూర్తి చేశారు. ఫీడర్ కాలువ పటిష్ఠతకు రూ.456 కోట్లు ఖర్చు చేసి కాంక్రీట్ రిటైనింగ్‌వాల్, లైనింగ్ పనులు పూర్తి చేశారు. టన్నెల్-2లో బెంచింగ్ లైనింగ్ పనులు వేగంగా చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 2,770 మీటర్ల బెంచింగ్ పనులు చేస్తే, కూటమి హయాంలో 4,924 మీటర్ల పనులు పూర్తి చేశారు., వైసీపీ సర్కారు ఐదేళ్లలో 702 మీటర్ల లైనింగ్ మాత్రమే చేయగా, కూటమి వచ్చాక 6,988 మీటర్ల లైనింగ్ పూర్తి చేసింది. టీబీఎం తొలగింపునకు కోర్టు అనుమతులతో వెంటనే పనులు ప్రారంభించి దాని విడిభాగాలు బయటకు తెచ్చారు. మొత్తం 1,901 టన్నులకు గాను ఇప్పటికి 1,650 టన్నుల భాగాలు బయటకు తీశారు. కొల్లంవాగు వద్ద హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేయడంతో పాటు అక్కడ కుప్పగా పోసిన మక్, టన్నెల్‌లలో ఉన్న దాదాపు 1.20లక్షల క్యూ.మీ మక్ (మట్టి వ్యర్థాలు) తొలగింపు పూర్తి చేశారు.

### నిర్వాసితుల సమస్యకు పరిష్కారం

వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో ఉన్న 7,321 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపును కూటమి ప్రభుత్వం చేపట్టింది. నీటి విడుదలకు ముందే చెల్లిస్తామని చెప్పినట్టుగానే జూన్ 29న రూ.306 కోట్లు, రెండో విడత ఈనెల 19న రూ.200 కోట్లు, మూడో విడత 22న రూ.250 కోట్లు చెల్లించింది. మిగిలిన రూ.132 కోట్ల పరిహారాన్ని నిర్వాసితులకు సంబంధించిన సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇక త్వరలో నీటి విడుదల చేయనున్న నేపథ్యంలో 11 గ్రామాల నిర్వాసితులు ఊళ్లు ఖాళీ చేసి బయటకు వస్తున్నారు. వారికి కేటాయించిన కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వం ప్లాట్ల కేటాయింపును పూర్తి చేస్తోంది. మొత్తంమీద 2014 నుంచి 2019వరకు రూ.1,388.81 కోట్లు, 2024 నుంచి ఇప్పటివరకు రూ.2,402.35 కోట్లు ఖర్చు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుంది. మధ్యలో వైసీపీ సర్కారు పూర్తి కాని ప్రాజెక్టును జాతికి అంకితం చేయగా.. అన్ని పనులూ చేసి ఈ నెల 31న మొదటి సొరంగం ద్వారా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేసి నల్లమలసాగర్ రిజర్వాయర్‌కు చేరుస్తున్నారు.

### జగన్ సర్కారు నిర్వాకం

2019-24 మధ్య జగన్ సర్కారు ప్రాజెక్టు పనులను పూర్తిగా అపహాస్యం చేసింది. ఐదేళ్లలో కేవలం రూ.981.66 కోట్ల పనులను చేసి అందులో కూడా రూ.140 కోట్ల బిల్లులను చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచింది. టన్నెల్-2లో ఇరుక్కుపోయిన టీబీఎం తొలగింపు గురించి కనీస ఆలోచన చేయలేదు. హెడ్ రెగ్యులేటర్ పనులు కూడా పూర్తి చేయలేదు. నిర్వాసితుల ఆర్అండ్ఆర్ విషయం పట్టించుకోకుండా పునరావాస కాలనీలను కూడా వదిలేయడంతో చిల్లచెట్ల మధ్య కాలనీలన్నీ ఉండిపోయాయి. ఇవన్నీ చేయకుండానే నాటి సీఎం జగన్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేశారు.

### ప్రాజెక్టు పరిధి

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నాలుగు జిల్లాల్లోని 30 మండలాల పరిధిలో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మార్కాపురం జిల్లాలో 20 మండలాలు, ప్రకాశంలో 3, నెల్లూరులో 5, కడప జిల్లాలో 2 మండలాలకు నీరందుతుంది. ఫ్లోరైడ్ ప్రాంతాల్లోని 23 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుంది. నాలుగు జిల్లాల్లో 9 నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. వాటిలో ఎర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కొండపి, దర్శి, ఉదయగిరి, ఆత్మకూరు, బద్వేలు నియోజకవర్గాలు ఉన్నాయి. భూగర్భ జలాల మట్టాలు పెరుగుతాయి. 840 అడుగుల శ్రీశైలం ఫోర్‌షోర్ నుంచి కృష్ణా వరద జలాలు అందుబాటులోకి వస్తాయి.

### కొనసాగుతున్న వెలిగొండ సంబరాలు

వెలిగొండ ప్రారంభానికి సిద్ధమవడంతో మార్కాపురం జిల్లా అంతటా సంబరాలు సాగుతున్నాయి. వరాల వెలిగొండ వారోత్సవాల పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అందులో భాగంగా ఎర్రగొండపాలెంలో గురువారం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయ మాడవీధుల్లో భారీఎత్తున మహిళలతో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు.

### కీలక ఘట్టాలు

1985లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రతిపాదనను ఉమ్మడి ప్రకాశం జిల్లాల నేతలు తీసుకువెళ్లారు.

1994లో ఈ ప్రాజెక్టు సమగ్ర నివేదిక సిద్ధమైంది.

1996 మార్చి 5వ తేదీన ముఖ్యమంత్రిగా
చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు.

1998లో ఇంజనీర్-సలహాదారు రామకృష్ణయ్య ప్రాజెక్టు ప్రాథమిక నివేదిక తయారు చేశారు.

1998లో సుంకేసుల, గొట్టిపడియ ఆనకట్టలకు రూ.138 కోట్లతో పాలనా అనుమతులు.

1999లో సుంకేసుల గ్యాప్ పనులు ప్రారంభం

### మారనున్న 'మార్కాపురం' భవిష్యత్తు

బిందెడు నీళ్ల కోసం ఎదురు చూపులు.. ఫ్లోరైడ్ సమస్యలతో అనారోగ్యం బారినపడటం.. పంట పండుతుందనే ఆశతో విత్తనం వేయడం.. పంట పండకపోతే వలసపోవడం.. ఇవన్నీ మార్కాపురం జిల్లా ప్రజల కష్టాలు. వర్షం పడితే పంట.. పండకపోతే అప్పు. బోరు పనిచేస్తే సాగు.. అడుగంటితే వలస. ఇలా తరతరాలుగా కరువుతో పోరాడిన ప్రజల కష్టాలు తీర్చేందుకు వెలిగొండ ప్రాజెక్టు భరోసా ఇవ్వనుంది. ఒకప్పుడు రాయలసీమ కంటే తీవ్ర కరువు కాటకాలకు చిరునామాగా నిలిచిన మార్కాపురం ప్రాంతానికి ఇప్పుడు వెలిగొండ జలాలు కొత్త ఆశలు తీసుకొస్తున్నాయి.

## అందరినీ క్షేమంగా తేవడమే మన ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి

సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని,

### 41 మంది చిక్కుకున్నారు..

మానస సరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకుపోయిన ఏపీ యాత్రికుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్లు ఇప్పటివరకు గుర్తించామని.. వీరిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరించాల్సి ఉండడంతో ప్రస్తుతం కొందరు అక్కడే చిక్కుకుపోయారని తెలిపారు. కర్నూలు-ఆదోని ప్రాంతానికి చెందిన నలుగురు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని, వారితో మాట్లాడామని చెప్పారు. తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు కాట్‌మాండూలో సురక్షితంగా ఉన్నారని, వారిని కూడా ఆర్టీజీఎస్ నుంచి సంప్రదించామని తెలిపారు. చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు ప్రాంతాలకు చెందిన ఏడుగురు గల్లంతయ్యారని.. వారి ఫోన్లు అందుబాటులో లేవని చెప్పారు. సమాచారాన్ని బాధితుల కుటుంబాలకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని చెప్పారు. ఢిల్లీ ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతరం సమాచారం సేకరిస్తున్నామని.. కేంద్రంతో పాటు కాట్‌మాండూ, చైనా ఎంబసీలతో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు.

## రూ.1,430 కోట్లతో అభివృద్ధి పనులు

-మొదటిపేజీ తరువాయి

అంగీకరించడంతో పాటు, డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా ఆమోదం లభించింది. నేషనల్? ఇన్‌స్టిట్యూట్? ఆఫ్? ఎలక్ట్రానిక్స్?, ఐటీసీఎల్? గ్రీన్? ఎనర్జీ అభివృద్ధికి కూడా అనుమతులు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు. 2026 జనవరి 6 లోపు రుణాలు తీసుకున్న రెండో దశ భూ సమీకరణ రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించినట్లు తెలిపారు. 'నగరంలో 135 లీటర్ల నీటిని ప్రతీ ఇంటికి ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఇప్పుడున్న పైప్?లైన్లతో ఆ నీటి పంపిణీ చెయ్యడానికి కుదరదు. వాటర్? పైప్?లను మార్చడానికి అదనంగా రూ. 533 కోట్లు విడుదల చెయ్యడం జరిగింది. ఎల్పీఎల్? చిన్న రోడ్లు వెయ్యాలనుకున్నాం. కొన్ని సంస్థలతో వీటిని అధ్యయనం చేయించాం. కొత్త నగరానికి తరచూ ఎక్కువ వాహనాల రాకపోకలు ఉంటాయి కానీ సీసీ రోడ్లు వేస్తే దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు చెప్పారు. ఆ సమస్యకు చెక్? పెట్టేందుకు బీటీ రోడ్లకు అనుమతులు వచ్చాయి. సెంట్రలైజ్?డ్? పబ్లిక్? లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్?ఆర్? భవనాల నిర్మాణాలకు ఐటీసీతో ఎంఓయూలు కుదుర్చుకోవడానికి అనుమతులు వచ్చాయి.' -పి. నారాయణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

## పంచదార్ల కొండపైతవ్వకాలు బంద్!

**అమరావతి :** అనకాపల్లి జిల్లా పంచదార్ల కొండపై ఉన్న ఆలయాల సంరక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కొండప్రాంతాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రకటిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రాంతంలో ఇప్పటికే ఇచ్చిన గ్రావెల్ మైనింగ్ లీజులు పనిచేయవని సర్కారు స్పష్టం చేసింది. ఇకపై భవిష్యత్తులోనూ అక్కడ ఎలాంటి మైనింగ్ అనుమతులు ఇవ్వరు. ఇంకోవైపు.. అక్కడ జరిగిన అక్రమ మైనింగ్‌పైనా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గనుల శాఖ అధికారిని సస్పెండ్ చేసింది. తాజాగా అక్రమ తవ్వకాలు జరిపిన లీజుదారు నుంచి పెనాల్టీ వసూలుకు డిమాండ్ నోటీసులు జారీ చేసింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం పంచ దార్ల గ్రామంలోని కొండపై శ్రీ ఉమా ధర్మలింగేశ్వర ఆలయం, రాధా మాధవస్వామి, విశ్వేశ్వరస్వామి, సహస్ర లింగేశ్వరస్వామి ఆలయాలు చాలా ఉన్నాయి. రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ఐదు ధారలు ప్రవహిస్తుంటాయి. అందుకే ఈ ప్రాంతానికి పంచధారలని.. పంచదార్ల కొండ అని పేరు వచ్చిందని చెబుతుంటారు. ఈ ఏడాది మే నెలలో ఈ కొండ ప్రాంతంలోని సర్వే నంబర్ 1లో 2.153 హెక్టార్ల పరిధిలో గ్రావెల్ మైనింగ్ లీజును విజయ్‌కుమార్‌నాయుడు అనే వ్యక్తికి గనుల శాఖ ఇచ్చింది. అయితే లీజుదారు హద్దులు దాటి.. నిబంధనలకు విరుద్ధంగా ఆలయాలకు సమీపంగా మైనింగ్ చేసుకుంటూ వెళ్తుండడంతో గర్భగుడులకు ప్రమాదం పొంచి ఉందని భక్తులు, గ్రామస్థులు ఆందోళనలకు దిగారు.ఇటు దేవదాయ శాఖకు, అటు రెవెన్యూ, అటవీ, పర్యావరణ శాఖలకు కూడా ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)కి సైతం ఫిర్యాదులు అందాయి. అయితే గనుల శాఖ అధికారులు పెద్దగా స్పందించలేదు. ఇందుకు కారణం రాజకీయ ఒత్తిళ్లే. మైనింగ్ చేసేది ఓ ప్రముఖ ప్రజాప్రతినిధికి కావలసిన వ్యక్తి అని.. అక్కడ ఏం జరిగినా కన్నెత్తి చూడవద్దని, ఫిర్యాదులను లెక్కచేయొద్దని మౌఖిక ఆదేశాలు ఉండడం వల్లే వారు మౌనం వహించారని విమర్శలు వెల్లువెత్తాయి.

అక్ర మ మైనింగ్ ఫిర్యాదులపై తొలుత విచారణ జరిగింది. నేరుగా జిల్లా ఏడీ శ్రీనివాస్ నేతృత్వంలో జాయింట్ సర్వే చేయించారు. లీజు ఏరియాను దాటి వాయవ్య దిశగా ప్రభుత్వ భూముల పరిధిలో 1.39 లక్షల టన్నుల మేర గ్రావెల్ తవ్వినట్లు నిర్ధారించారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని గనుల శాఖ తేల్చింది. డిస్పాచ్ పర్మిట్లు 1.04 లక్షల మెట్రిక్ టన్నుల వరకే లీజుదారుకు ఇచ్చారు. ఆయన పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారని గనుల శాఖ గుర్తించింది. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా, ప్రజాప్రతినిధులు సమాచారం ఇచ్చినా స్పందించని గనుల శాఖ ఏడీ శ్రీనివ్ష?సను సస్పెండ్ చేసింది. తర్వాత మైనింగ్ లీజుదారుకు కూడా నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తవ్వి తీసుకెళ్లిన గ్రావెల్‌కు పెనాల్టీ చెల్లించాలని స్పష్టంచేశారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పంచదార్లకొండను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని గనుల శాఖ డైరెక్టర్ డబ్ల్యూబీసీ చంద్రశేఖర్ ఈనెల 17న ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. నిజానికి పంచదార్లకొండ ప్రాంతంలో 2.153 హెక్టార్ల పరిధిలో గ్రావైల్ మైనింగ్ లీజు అనుమతులు పదేళ్లకు సరిపడా ఇచ్చారు. అయితే అక్రమ మైనింగ్ నిర్ధారణ అయిన నేపథ్యంలో అనుమతులు నిలిపివేసి.. కొండ ప్రాంతంలో మైనింగ్‌పై మొత్తంగా నిషేధం విధించాలని డైరెక్టర్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు సర్కారు తాజాగా ఆమోదం తెలిపింది. పంచదార్లకొండపై మైనింగ్‌ను నిషేధిస్తూ, ఆ ప్రాంతాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రకటిస్తూ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా గురువారం జీవో 226 జారీ చేశారు. త్వరలో ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

## హిందూ సెంటిమెంట్ కు చోటుందా

**నెల్లూరు :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన తర్వాత రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉన్న వి.విజయసాయిరెడ్డి క్యాంపు మార్చి, సరికొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ఆకస్మికంగా ప్రకటించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్టీ స్థాపన కంటే ఎక్కువగా ఆయన ఎంచుకున్న హిందూత్వ ఎజెండా, సామాజిక మతపరమైన అంశాలు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ లవ్ జిహాద్ ఆరోపణల వ్యవహారం, సాధిక్ ఖాన్ అంశంపై పదే పదే మాట్లాడటం , ఏపీలో మత మార్పిడుల నిరోధక చట్టం తేవాలని కోరడం ద్వారా తన నూతన పొలిటికల్ లైన్ హార్డ్ కోర్ హిందూత్వ అని విజయసాయిరెడ్డి స్పష్టమైన సంకేతాలిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే.. ఉత్తరాది రాష్ట్రాలు లేదా పక్కనే ఉన్న కర్ణాటక మాదిరిగా మతపరమైన సమీకరణాలు , పోలరైజేషన్‌ఓటు బ్యాంకుగా మారిన దాఖలాలు లేవు . ఉమ్మడి ఏపీ నుంచి నేటి వరకు ఇక్కడ రాజకీయం అంతా కుల సమీకరణాలు, సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి , బలమైన ప్రాంతీయ నాయకత్వాల చుట్టూనే తిరిగింది. బీజేపీ కూడా ఏపీలో సుదీర్ఘకాలంగా ఉనికిలో ఉన్నప్పటికీ, ఒంటరిగా మత ఆధారిత ఓట్లతో సక్సెస్ కాలేకపోయింది. అందుకే విజయసాయిరెడ్డి తెరపైకి తెచ్చిన లవ్ జిహాద్ , మత మార్పిడుల కార్డు ఆంధ్రా నేలపై ఎంతవరకు ఫలితాన్నిస్తుందనేది ప్రధాన ప్రశ్న.ఏపీ ఓటర్లు ఎప్పుడూ కుల ప్రాతిపదికన, సంక్షేమ ఆధారంగా ఓటు వేయడానికి ప్రాధాన్యతనిచ్చారు తప్ప.. తీవ్రమైన మతపరమైన ఎజెండాలను స్వీకరించలేదనడానికి గత ఎన్నికల ఫలితాలే ఉదాహరణ. విజయసాయిరెడ్డి ఈ వ్యూహాన్ని ఎంచుకోవడం వెనుక బలమైన రాజకీయ అంశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్సీపీ మైనారిటీలు, క్రిస్టియన్ల వైపు ఆకర్షితమైందనే టాక్ ఉన్నందున .. అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కూడా మైనారిటీ ఓట్లను కోల్పోకూడదనే భయంతో లవ్ జిహాద్ వంటి సున్నితమైన అంశాలపై మాట్లాడటానికి వెనుకాడుతోందని ఆయన బహిరంగంగానే ఆరోపించారు. ఈ రెండు ప్రధాన వర్గాల మధ్య ఖాళీగా ఉన్న కట్టర్ హిందూ ఓటు బ్యాంకు ను టార్గెట్ చేయడం ద్వారా, తన కొత్త పార్టీకి ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించవచ్చని విజయసాయిరెడ్డి భావిస్తున్నారని అనుకోవచ్చు.

# ఏటికొప్పాకలో హస్తకళల హబ్ పార్కు నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**యలమంచిలి ( పబ్లిక్ వ్యూ ) ఆగస్టు 27.** మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న హస్తకళాకారుల హబ్ పార్కు నిర్మాణ స్థలాన్ని గురువారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాసిల్దార్ వరహాలరావు, ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి ఆయన స్థలాన్ని పరిశీలించి, శుక్రవారం (రేపు) నిర్వహించనున్న భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాల ఏర్పాట్లపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విశ్వవిఖ్యాత ఏటికొప్పాక ఉడెన్ టాయ్స్ (చెక్క బొమ్మల) కళాకారులకు మెరుగైన వసతులు, ఆధునిక సాంకేతికతతో పాటు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ హబ్ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పార్కు అందుబాటులోకి వస్తే స్థానిక కళాకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ఏటికొప్పాక హస్తకళలకు మరింత ప్రచారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ?కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.



# నక్కపల్లిలో నేడు అంగరంగ వైభవంగా వరలక్ష్మీ వ్రతం





**పెన్ సత్తా ఆగస్టు 27** నక్కపల్లిలోని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. వరలక్ష్మీ వ్రతానికి సంబంధించిన ఏర్పాట్లను హోం మంత్రి అనిత స్వయంగా పరిశీలించారు. వ్రతానికి హాజరయ్యే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది సుమారు 4 వేల మంది మహిళలు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు వ్రత కార్యక్రమం ప్రారంభం కానుంది. పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధి నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ఈ వ్రతంలో పాల్గొననున్నారు. వ్రతంలో పాల్గొనే మహిళల కోసం ప్రత్యేకంగా పాస్‌లను ఏర్పాటు చేశారు. పాస్ ఉన్న మహిళలకు మాత్రమే వ్రత ప్రాంగణంలోకి ప్రవేశం కల్పించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మహిళల రాక, కూర్చునే ఏర్పాట్లు, వ్రత నిర్వహణ తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరిగే వరలక్ష్మీ వ్రతానికి పాయకరావుపేట నియోజకవర్గంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

# పోలవరం ఎడమ కాలువ జలహారతికి సీఎం చంద్రబాబు రాక







- 2న పాయకరావుపేటకు సీఎం పర్యటన
- ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత

**నక్కపల్లి పెన్ సత్తా ఆగస్టు 27 :** పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు సెప్టెంబర్ 2న పాయకరావుపేటకు రానున్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల చేయనున్న ప్రాంతాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గురువారం పరిశీలించారు. అనంతరం జలహారతి కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పీఎల్ పురం వద్ద ఏర్పాటు చేయనున్న సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలను హోం మంత్రి పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటనలో అనకాపల్లి జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని ఏర్పాట్లపై మంత్రికి వివరించారు. నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని హోం మంత్రి అనిత సూచించారు. పరిశీలన అనంతరం పీఎల్ పురం వద్ద గణేష్ టీ షాప్‌లో హోం మంత్రి అనిత టీ తాగారు. స్థానికులతో కొద్దిసేపు ముచ్చటించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల ఉత్తరాంధ్ర రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే చారిత్రాత్మక ఘట్టమని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రైతుల కల



నెరవేరబోతోందన్నారు. ఎడమ కాలువ ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్రలోని రైతులకు సాగునీటి పరంగా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

## కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం

**అంబాజీపేట, పెన్ సత్తా ఆగస్టు 27 :** :కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు ఖుటమి నాయకులు వివరించారు. నాయకులు గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధి 114బూత్ లలో" రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచుతున్న నమ్మకానికి, చూపిస్తున్న అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము, తెలుగు యువత అధ్యక్షులు, జోగి కృష్ణ చైతన్య, బూత్, కన్వీనర్, మట్టపర్తి శ్రీనివాస్, నేలపూడి సత్యనారాయణ, మట్టపర్తి ఏసు తదితరులు పాల్గొన్నారు

# రాఖీతో అనుబంధం





**అన్నా--చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ**

**కైట్స్ విద్యా విహార్‌లో ముందస్తు రాఖీ వేడుకలు**

**అచ్యుతాపురం, పెన్ సత్తా ఆగస్టు 27** అన్నా--చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని కైట్స్ విద్యా విహార్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ముందస్తు వేడుకలు గురువారం సందడిగా జరిగాయి. రంగురంగుల రాఖీలతో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటూ ప్రేమాభిమానాలను పంచుకున్నారు. రాఖీ కడుతున్న వేళ చిరునవ్వులు చిందిస్తూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులతో పాఠశాల ఆవరణ పండుగ వాతావరణాన్ని తలపించింది. రాఖీ కేవలం చేతికి కట్టే దారం కాదని.. అన్నా--చెల్లెళ్ల మధ్య ఆత్మీయత, ప్రేమ, పరస్పర రక్షణకు ప్రతీక అని పాఠశాల కరెస్పాండెంట్ రెడ్డి గణేష్ అన్నారు. కుటుంబ బంధాల విలువను తెలుసుకుని ఒకరినొకరు గౌరవిస్తూ, ప్రేమాభిమానాలతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న, డైరెక్టర్ ప్రియాంక, పీఈటీ శివాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






## ఘనంగా బోడపాటి శివదత్త జన్మదిన వేడుకలు

- మెగా రక్తదాన శిబిరం.. అన్నసమారాధన..
- 35 కిలోల కేక్ కటింగ్





**నక్కపల్లి పెన్ సత్తా ఆగస్టు 27** పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన నాయకులు, కూటమి నేతలు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానుల సందడి మధ్య బోడపాటి శివదత్త జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నక్కపల్లిలోని సుబ్బురామిరెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై బోడపాటి శివదత్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, జనసేన నాయకులు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ తోట నగేష్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వీర మహిళలు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నాయకులు, మాజీ జీవీఎంసీ కార్పొరేటర్లు, కూటమి నేతలు తదితర ప్రముఖులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా బోడపాటి శివదత్తను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా వేడుకలు

జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవా స్ఫూర్తిని చాటారు.

అదేవిధంగా వేడుకలకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం 35 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి బోడపాటి శివదత్త జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

జనసేన శ్రేణుల సందడి

వేడుకల సందర్భంగా జనసేన కార్యకర్తలు, వీర మహిళలు, పాయకరావుపేట నియోజకవర్గ కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సుబ్బురామిరెడ్డి కళ్యాణ మండపం సందడిగా మారింది. శివదత్తకు శు భాకాంక్షలు తెలియజేస్తూ అభిమానులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. బోడపాటి శివదత్తకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు, జనసేన కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒమ్మవరంలో మంత్రి అనిత ఇంటింటి ప్రచారం





**నక్కపల్లి పెన్ సత్తా ఆగస్టు 27** యస్. రాయవరం మండలం ఒమ్మవరం గ్రామంలో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఒమ్మవరం గ్రామానికి చేరుకున్న మంత్రి అనితకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులతో మంత్రికి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అనిత గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతున్న తీరును ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్ద ప్రజలను ఆప్యాయంగా పలకరించిన మంత్రి అనిత వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు

# బత్తలపల్లి టీచర్స్ కాలనీలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

- తక్షణ సాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయం.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా
- రానున్న నెలలో కొత్త పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకుంటాం: మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ సత్తా ఆగస్టు 27:**శ్రీశైలంలో చోటుచేసుకున్న విషాదకర ఘటనలో ధర్మవరం నియోజకవర్గం, బత్తలపల్లి చెందిన కుటుంబ సభ్యులు మృతి చెందడం పట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం బత్తలపల్లి మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఉన్న బాధిత కుటుంబ స్వగృహానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్డిఓ రాంభూపాల్ రెడ్డి, ఎమ్మార్వో ఈశ్వర ప్రసాద్, ఎంపీడీవో కిష్టప్ప, తదితర అధికారులతో కలిసి వెళ్లారు. కుటుంబ సభ్యుడు గోకల రాముడును పరామర్శించి, ప్రస్తుత కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. శ్రీశైలంలో జరిగిన ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన నేపథ్యంలో గోకల రాముడు కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితులను మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రస్తుతం ఉన్న అవసరాలు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. బాధిత కుటుంబానికి తక్షణ ఉపశమనంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ తనవంతుగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కష్ట సమయంలో కుటుంబం ఒంటరిగా లేదని, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అన్ని విధాలా అండగా ఉంటారని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బత్తలపల్లి బిజెపి మండల అధ్యక్షులు ఆకులేటి భాస్కర్, ఆకులేటి వీరనారప్ప, కోటి బాబు, తిరుపతయ్య, మల్లికార్జున, తదితర స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# మారెమ్మ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

- టిటిడి సహకారంతో ఆలయ నిర్మాణం చేపడతాం
- ధర్మకర్త లక్ష్మీనారాయణ నాయక్ వెల్లడి



**పెనుకొండ' పెన్ సత్తా ఆగస్టు 27:**మండల పరిధిలోని మునిమడుగులో మారెమ్మ అమ్మవారి దేవాలయం నిర్మాణానికి వేదపండితుల మంత్రంలతో భూమిపూజ కార్యక్రమం ధర్మకర్త లక్ష్మీనారాయణ నాయక్, గ్రామపెద్దల ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్త లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ దేవాలయం నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత 5 సెంట్లు స్థలం రెవెన్యూ ద్వారా ఇప్పించారని మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నా మన్నారు. ఆలయ నిర్మాణం కమిటీని 13 మందితో ఏర్పాటు చేశామని ట్రస్ట్ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహకారంతో నిర్మించాలని తీర్మానించుకున్నామని ఆయన తెలిపారు. దేవాలయం నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తున్న మునిమడుగు గ్రామ పంచాయతీ పెద్దల కు ట్రస్ట్ కమిటీ సభ్యులు అందరం ధన్యవాదాలు తెలుపుతు న్నామన్నారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్మాణానికి చిన్నపరెడ్డిపల్లి రాము తన వంతు సహాయంగా రూ. 5000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మారెమ్మ దేవాలయం ధర్మకర్త లక్ష్మీనారాయణ నాయక్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మునిమడుగు గ్రామపంచాయతీ టిడిపి ఇన్చార్జి లు వాసుదేవరెడ్డి, మల్లికార్జున, టిడిపి నాయకులు మల్లికార్జున,చిన్నపరెడ్డిపల్లి రాము,విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ నారాయణస్వామి నాయక్, తలమర్ల కమ్మన్న, కేశాని ఆదినారాయణ,చంద్ర నాయక్, గోపినాయక్ బిజెపి నాయకులు వెంకటరాముడు, హరికృష్ణ, కళ్యాణ్, సూరి, జ్యోతి ప్రసాద్, గ్రామ మహిళలు శైలుబాయి రామలక్ష్మీబాయి, శాంతి బాయి,జమ్మి బాయి, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం



- అర్థంతరంగా ఆగిన ప్రభుత్వ ఇళ్లను సకాలంలో నిర్మించుకోండి
- పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో 5 వ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ ఏర్పాటు తో నియోజవర్గ రూపురేఖలు మారడం ఖాయం
- హౌసింగ్ లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

**పుట్టపర్తి, పెన్ సత్తా ఆగస్టు 27:**అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ గృహం మంజూరు చేయడంతో పాటు, ఇప్పటికే మంజూరై అర్థంతరంగా ఆగిపోయిన ఇళ్లను సకాలంలో పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం హౌసింగ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గృహ నిర్మాణాల పురోగతి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, అర్థంతరంగా నిలిచిపోయిన ఇళ్ల వివరాలపై అధికారులతో ఎంఎల్ఏ చర్చించారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. గృహ నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పుట్టపర్తి ప్రాంతంలో రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో పరిశ్రమలు, పెట్టుబడులు రావడం ద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ రావడం ఈ ప్రాంతానికి గొప్ప వరమని, దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే ఆమడగూరు మండలంలో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కావడం ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, పుట్టపర్తి నియోజకవర్గంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని చెప్పారు. రాబోయే రోజుల్లో పుట్టపర్తి నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారడం ఖాయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ అధికారులు ప్రవల్లిక ,టీడీపీ నాయకులు ఉమాపతి, అంబులెన్స్ రమేష్, సుధాకర్ , సిబ్బంది, హౌసింగ్ లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.17.5 కోట్లు మంజూరు -- మంత్రి సవిత



### ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలి

### మున్సిపాలిటీ అభివృద్ధిపై నాయకులతో మంత్రి సవిత సమీక్ష

**పెనుకొండ, పెన్ సత్తా ఆగస్టు 27):**మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ తెలిపారు.. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ నాయకులు, సంబంధిత అధికారులతో అభివృద్ధి పనులపై ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రతి వార్డులో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వార్డుల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులను పూర్తి చేయడంతో పాటు అవసరమైన చోట మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో రూ. 17.5 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో 1,790 మందికి పక్కా ఇళ్లకు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే 100 కోట్లతో అమృత్ 2 పథకం కింద ఇంటింటికీ ఆర్.ఓ ప్లాంట్ ద్వారా మినరల్ వాటర్ అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని, రూ. 1 కోటితో పార్కుల అభివృద్ధి చేపడుతున్నట్లు వెల్లడించారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులను ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మంత్రి సవిత సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని నాయకులకు ఆమె ఆదేశించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇచ్చామని అని మంత్రి సవిత స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు శ్రీరాం యాదవ్ నాయకులు త్రివేంద్ర బాబుల్ రెడ్డి రఘు అస్లం షౌకత్ హుజురుల్లా ఇర్ఫాన్ చంద్రకాంతమ్మ ప్రభంజన్ స్వామి రియాజ్ శ్రీనివాసులు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జాతీయ సదస్సులో డాక్టర్ బత్తల అశోక్ కుమార్ పరిశోధనా పత్రం అందజేత



**తిరుపతి, పెన్ సత్తా ఆగస్టు 27:**తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు, పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'అన్నమయ్య సంకీర్తనలు--శ్రీ వెంకటేశ్వర వైభవం' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఆగస్టు 27, 28 తేదీల్లో జరుగుతున్న ఈ సదస్సులో తొలిరోజు రెండో గోష్ఠిలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పోస్ట్ డాక్టరల్ ఫెలో డాక్టర్ బత్తల అశోక్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా 'శ్రీ వేంకటేశ్వరునిపై అన్నమయ్య మధుర భక్తి సంకీర్తనావళి' అనే అంశంపై డాక్టర్ బత్తల అశోక్ కుమార్ తన పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. శ్రీ వేంకటేశ్వర స్వామిపై అచంచలమైన భక్తి భావంతో అన్నమయ్య రచించిన సంకీర్తనలు తెలుగు సాహిత్యంలో ఎంతో విశిష్టమైనవని ఆయన వివరించారు. అన్నమయ్య సంకీర్తనల్లో భక్తి, ఆధ్యాత్మికతతో పాటు మానవీయ విలువలు ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. అన్నమయ్య అందించిన అమూల్యమైన భక్తి సాహిత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పరిశోధనా పత్ర సమర్పణ అనంతరం డాక్టర్ బత్తల అశోక్ కుమార్‌ను సదస్సు నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ కె. ఈశ్వర్ బాబు ఆయనను శాలువాతో సత్కరించి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ అశోక్ కుమార్ పరిశోధనా సేవలను అభినందించారు.

# కేకేసి రాష్ట్ర సదస్సు కోసం నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల సమన్వయకర్తగా యం.యం.డి.ఇమామ్ కు బాధ్యతలు



**అనంతపురం సిటీ, పెన్ సత్తా ఆగస్టు 27:**అఖిల భారత అసంఘటిత కార్మికులు మరియు ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసి) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న కేకేసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉదిత్ రాజ్ హాజరవుతున్న సందర్భంగా విజయవాడ ఆంధ్రరత్నా భవన్ లో జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేసే దిశగా అనంతపురం జిల్లా కు చెందిన ఏపీ అసంఘటిత కార్మికులు మరియు ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసి) రాష్ట్ర అధికార ప్రతినిధి అయిన యం.యం.డి.ఇమామ్ గారికి నెల్లూరు, బాపట్ల, ప్రకాశం, గుంటూరు (4) జిల్లాల బాధ్యతలను కేటాయిస్తూ కాంగ్రెస్ పార్టీ ఏపీ రాష్ట్ర అసంఘటిత కార్మికులు మరియు ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసి) రాష్ట్ర అధ్యక్షులు కైపు వెంకటకృష్ణారెడ్డి గారు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన మీద నమ్మకంతో నాలుగు జిల్లాలకు ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షులు కైపు వెంకటకృష్ణారెడ్డికి యం.యం.డి.ఇమామ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని రాష్ట్ర సదస్సును విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో మోదీ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు బిష్కెక్ నగరంలో ఎస్‌సీవో సదస్సుకు మోదీ హాజరవుతారు. చివరి రోజు ఆయన ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఆరో 'వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ వేడుకల్లోనూ ఇతర ఎస్‌సీవో దేశాల నేతలతో కలిసి మోదీ పాల్గొంటారు. కిర్గిజ్‌స్థాన్ పర్యటనకు ముందు 29, 30 తేదీల్లో మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తారు. పుతిన్?తో జరిగే భేటీలో భారత్?- రష్యా ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య సహకారం, పరస్పర ప్రయోజనాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై నేతలు సమీక్ష నిర్వహించనున్నట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి సీబీ జార్జ్ తెలిపారు. అలాగే ఇతర దేశాల నేతలతోనూ మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఆయా నేతల సమయానుకూలత, అందుబాటును బట్టి సమావేశాల షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.



**ముందుగా ఉజ్బెకిస్థాన్‌కు మోదీ**

కిర్గిజిస్థాన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఆగస్టు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళ్లనున్నారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన కాగా, ద్వైపాక్షిక పర్యటనగా రెండోసారి వెళ్లడం. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు నిర్వహించనున్నారు. భారత్-ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు నేతలు చర్చించనున్నారు.

**దాదాపు 100 కోట్ల డాలర్ల వాణిజ్యం, పెట్టుబడులు**

భారత్-ఉజ్బెకిస్థాన్ మధ్య ఆర్థిక సంబంధాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విలువ కలిపి దాదాపు 100 కోట్ల డాలర్లకు చేరినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కీలక ఖనిజాలు, ఔషధాలు, విద్య, సమాచార సాంకేతికత, ఆరోగ్య రంగాల్లో ఇరు దేశాలు సహకరిస్తున్నాయి. ఉజ్బెకిస్థాన్‌లో ప్రస్తుతం 16 వేలకు పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. అక్కడ నాలుగు భారతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు కూడా ఉన్నాయి. ఔషధాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, వినోద పార్కులు, విద్య తదితర రంగాల్లో భారతీయ పెట్టుబడులు ఉన్నాయి.

**'వికసిత్ భారత్-2047'పై చర్చ**

మోదీ, మిర్జియోయెవ్ సమావేశంలో భారత్ ప్రతిపాదిస్తున్న 'వికసిత్ భారత్-2047', ఉజ్బెకిస్థాన్ అభివృద్ధి లక్ష్యం 'ఉజ్బెకిస్థాన్-2030' మధ్య సహకారానికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, ఆరోగ్య రంగం, విద్య, అంతరిక్షం, సాంకేతికత, సంస్కృతి, వ్యాపార సంబంధాలు వంటి కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచుకోవడంపై ఇరు దేశాలు దృష్టి సారించనున్నాయి. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఉజ్బెక్ అధ్యక్షుడు మోదీ గౌరవార్థం ఏర్పాటు చేసే విందులోనూ ప్రధాని పాల్గొంటారు. ఎస్‌సీఓలో ప్రస్తుతం 10 సభ్య దేశాలు ఉన్నాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. కాలక్రమేణా వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, కనెక్టివిటీ, సాంకేతికత తదితర రంగాలకు కూడా సహకారం విస్తరించింది.

# భారత అథ్లెట్ల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందా

యువతను పాడుచేస్తున్న డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడటంలో క్రీడలు ఒక అద్భుతమైన ఆయుధంగా పనిచేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. క్రీడలు జీవితాలను ఎలా మార్చగలవో చెప్పడానికి మన పారా అథ్లెట్లు ఒక ఉదాహరణ అని, వారి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని అన్నారు. క్రీడల పట్ల తన దృక్పథం కేవలం పతకాలు సాధించడం మాత్రమే కాదని, దేశ నిర్మాణ ప్రక్రియలో వాటిని ఒక అంతర్భాగంగా మార్చడమేనని పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా డైలాగ్?లో మోదీ వర్చువల్?గా పాల్గొని మాట్లాడారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది క్రీడాకారులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



"ఒలింపిక్స్‌లో అనేక రకాల క్రీడలు ఉంటాయి. కానీ భారతీయ జట్లు వాటిలో కనీసం సగం విభాగాల్లో కూడా పాల్గొనడంలేదు. ఇదొక చేదు నిజం. ఎందుకంటే, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మొత్తం 32 క్రీడా విభాగాలలో భారత్ కేవలం 16 విభాగాల్లో మాత్రమే పాల్గొంది. మొత్తం పతకాల సంఖ్యలో గణనీయమైన భాగానికి మనం పోటీనే పడటం లేదు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రపంచంలోని ఇతర దేశాలు క్రీడల్లో పతకాలు సాధిస్తుంటే, మనం కనీసం వాటిలో పాల్గొనడం కూడా లేదు. పతకాల సంఖ్యను పెంచుకోవాలంటే సంబంధిత క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ఇటీవల నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్?కు పతకాలు తెచ్చిపెట్టే బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, రెజ్లింగ్ వంటివి లేకపోవడం ఈ సమస్య మరింత స్పష్టంగా కనిపించింది. మొత్తం 10 క్రీడలకు గాను ఆరు పారా-క్రీడా ఈవెంట్లలో మాత్రమే భారత్ పాల్గొంది. అయినప్పటికీ, 13 స్వర్ణాలు, 17 రజతాలు, తొమ్మిది కాంస్య పతకాలతో పాయింట్ల పట్టికలో భారత్? నాలుగో స్థానంలో నిలిచింది."

**'యువ ప్రతిభను గుర్తించాలి'**

ఆరోగ్యకరమైన సమాజానికి క్రీడా స్ఫూర్తి చాలా ముఖ్యమని, అయితే, మైదానంలోకి అడుగుపెట్టకుండా ఆ స్ఫూర్తిని అలవర్చుకోవడం చాలా కష్టమని మోదీ అన్నారు. విజేతలుగా ఎలా నిలవాలో నేర్పడమే కాకుండా, మంచి పోటీదారులుగా ఎలా ఎదగాలో క్రీడల నుంచి నేర్చుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే అథ్లెట్లను సిద్ధం చేయాలని మోదీ పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన ఒలింపిక్స్ పోటీల్లో భారత్? నుంచి చాలా తక్కువ జట్లు పాల్గొన్నారని చెప్పారు. "2036 ఒలింపిక్స్ భారతదేశంలోనే జరగాలని మేం నిర్ణయించుకున్నాం. ఈ నేపథ్యంలో వివిధ క్రీడాంశాలపై భారత్? దృష్టి సారించాల్సిన అవకాశం ఉంది. 2036 ఒలింపిక్స్ సన్నద్ధతలో భాగంగా, ముఖ్యంగా ప్రస్తుతం ఐదు, 10 లేదా 15 ఏళ్ల వయస్సు ఉన్న యువ ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రతి గ్రామం, నగరం, పాఠశాలలో ప్రతిభాన్వేషణ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం" అని మోదీ తెలిపారు.

**'వారికి ప్రభుత్వ మద్దతు ఉంటుంది'**

అయితే, క్రీడల్లో పాల్గొనేందుకు అభ్యర్థులకు అవసరమైన మద్దతును ప్రభుత్వం తప్పక అందిస్తుందని మోదీ హామీ ఇచ్చారు. 21వ శతాబ్దపు ఆధునిక క్రీడా వ్యవస్థను (ఎకోసిస్టమ్) రూపొందించడానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆ దిశగా క్రీడా విశ్వవిద్యాలయాల నుంచి ఆధునిక శిక్షణా కేంద్రాల వరకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. 80 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి తాను చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆ ప్రసంగంలో భారతదేశ క్రీడా భవిష్యత్తుపై తన దార్శనికతను వివరించారు. దేశ క్రీడా బలాన్ని యువ శక్తితో మేళవించి, దానిని దేశ నిర్మాణానికి మళ్లించడమే ప్రధాన లక్ష్యమని మోదీ పేర్కొన్నారు.

# 400 మందితో భారత్‌కు జిన్‌పింగ్

**న్యూఢిల్లీ :** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చే నెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 400 మంది అధికారుల భారీ ప్రతినిధి బృందంతో ఆయన రానున్నట్లు సమాచారం. 2020 నాటి సరిహద్దు వివాదాల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపరిచే దిశగా.. ఇది ఓ కీలక పరిణామంగా మారనుంది. అదే సమయంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సరిహద్దు చర్చల నిమిత్తం బీజింగ్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. బ్రిక్స్ సదస్సు కోసం షీ జిన్‌పింగ్ వెంట దాదాపు 400 మంది సభ్యులతో కూడిన భారీ ప్రతినిధి బృందం భారత్‌కు రానున్నట్లు సమాచారం. 2019 నాటి పర్యటనతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపు కావడం గమనార్హం. ప్రస్తుతం చైనా అధికారులు ఢిల్లీలో హోటళ్ల కేటాయింపులు, భద్రతా ప్రోటోకాల్‌లను ఆఖరి దశలో సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. సదస్సు కేవలం బ్రిక్స్ ఎజెండా కోసమే కాకుండా భారత్-చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ సంకేతంగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవైపు షీ జిన్‌పింగ్ రాకపై సన్నాహాలు జరుగుతుండగానే.. మరోవైపు భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సోమవారం చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం వెళ్లిన డోభాల్.. మంగళవారం జరిగే రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో పాల్గొని సుదీర్ఘ సరిహద్దు వివాదాలపై చర్చించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చైనా విదేశాంగ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు వాంగ్ ఈ తో కూడా ఆయన ద్వైపాక్షిక సమావేశం కానున్నారుభారత్-చైనా మధ్య హిమాలయ ప్రాంతంలో 3,800 కిలో మీటర్ల మేర సరిహద్దు వివాదం కొనసాగుతోంది. 2020లో జరిగిన గల్వాన్ లోయ ఘర్షణల్లో 20 మంది భారత సైనికులు, నలుగురు చైనా సైనికులు ప్రాణాలు కోల్పోవడంతో ఇరు దేశాల మధ్య శాంతి వాతావరణం పూర్తిగా దెబ్బతింది. ఆ తర్వాత నాలుగేళ్ల మిలిటరీ సైనిక చర్చల ఫలితంగా 2024 అక్టోబర్ నాటికి ఒప్పందం కుదిరింది. అయితే జూలై చివర్లో సరిహద్దు వద్ద మళ్లీ సైనికులు ఎదురెదురుపడటంతో.. సరిహద్దుల్లో పూర్తి శాంతి పునరుద్ధరణే దౌత్య సంబంధాలకు ప్రాతిపదిక అని భారత్ ఇటీవల స్పష్టం చేసింది. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠినమైన వాణిజ్య విధానాల నేపథ్యంలో.. భారత్, చైనా రెండూ బ్రిక్స్ వేదికగా పరస్పర సహకారాన్ని పెంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. షీ జిన్‌పింగ్ చివరి పర్యటన నిర్ణయం ఇంకా పూర్తిగా ఖరారు కావాల్సి ఉన్నప్పటికీ.. బీజింగ్ మాత్రం భారత్ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.



## 'ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యనే మరో 25 ఏళ్లు పాటు కొనసాగించాలి' -డీలిమిటేషన్‌పై మోదీకి ఖర్గే లేఖ



దేశ రాజకీయాల్లో కీలకమైన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వానికి కీలక ప్రతిపాదనలు చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీలతో పంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. ప్రస్తుత లోక్?సభలోని సభ్యుల సంఖ్యను 25 ఏళ్ల పాటు యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలి. అంతేకాకుండా రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యలోనూ మరో 25 ఏళ్లపాటు మార్పులు చేయకూడదు. దీంతో పాటు 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ అమలు చేయాలి. డీలిమిటేషన్‌తో పాటు మహిళా రిజర్వేషన్ అంశం కూడా దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యమున్న అంశం. ప్రభుత్వం వద్ద ఉన్న డీలిమిటేషన్ ప్రతిపాదనలను అన్ని పార్టీలతో చర్చించాలి. వాటిని అధ్యయనం చేసేందుకు రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సమయం ఇవ్వాలి' అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. జులై 16న కూడా ఇదే అంశంపై ప్రధానికి లేఖ రాసినట్లు ఖర్గే గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని అప్పుడే కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పుడు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి టీవీ ఇంటర్వ్యూలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని చెప్పడంతో మరోసారి ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీలిమిటేషన్ వంటి కీలకమైన అంశంపై కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా విస్తృతంగా చర్చించాలని ఖర్గే కోరారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని అన్నారు. ఏప్రిల్ 16, 17 తేదీల్లో చేసినట్లుగా మరోసారి ఈ ప్రక్రియను బుల్డోజ్ చేయడానికి ప్రయత్నించవద్దని ప్రధాని మోదీని ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు.

**మహిళా రిజర్వేషన్‌పైనా కాంగ్రెస్ పట్టుబట్టు**

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్? కల్పించాలన్న అంశాన్ని కాంగ్రెస్? గతంలోనూ ప్రస్తావించింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ డిమాండ్లను పునరుద్ఘాటించాయి. డీలిమిటేషన్?కు సంబంధించిన అంశాలతో ముడిపెట్టి మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలన్న ప్రధాని విజ్ఞప్తిని కాంగ్రెస్ గతంలో విమర్శించింది. మహిళ రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తోందని ఆరోపించింది.

**ఏప్రిల్‌లో బిల్లుకు ఎదురుదెబ్బ**

2026 బడ్జెట్ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఎదురుదెబ్బ తగిలింది. ఏప్రిల్ 17న జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొన్నారు. వారిలో 298 మంది బిల్లుకు అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలోని ఓట్లలో మూడింట రెండు వంతుల మద్దతు అవసరం. అంటే 352 ఓట్లు రావాల్సి ఉండగా, అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక పార్లమెంట్ వర్షాకాల? సమావేశాలు నిరవధిక వాయిదా రెండు వారాలపైగా అవుతున్న ఇంతవరకు ప్రొరోగ్?పై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహిళ రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి ప్రతిపాదన తీసుకొస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## 'ఆపరేషన్ సిందూర్‌లో చైనా పాత్రపై గందరగోళం' - మాజీ జనూ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రశ్నలు

ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా- పాకిస్థాన్ మధ్య సైనిక సహకారంపై మాజీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రశ్నలు వర్షం కురిపించింది. గతంలో డిప్యూటీ చీఫ్? ఆఫ్? ఆర్మీ స్టాఫ్? లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు, తాజాగా అనిల్ చౌహాన్ చెప్పిన అంశాలకు పొంతన లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గతేడాది రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలు, తాజాగా అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను జైరాం రమేశ్ ఎక్స్?లో షేర్ చేశారు. చైనా- పాక్ సైనిక సహకారంపై భిన్నమైన వాదనలు ఎందుకు వినిపిస్తున్నాయని ప్రశ్నించారు. 2025 జులై 4న లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా-పాకిస్థాన్ మధ్య ఉన్న సహకారం గురించి తీవ్రంగా ప్రస్తావించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. అయితే 2026 ఆగస్టు 25న మాజీ సీడీఎస్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలు అందుకు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఏం జరుగుతోంది కథనాన్ని మార్చేందుకు ఏదైనా లోతైనా ప్రణాళిక ఉందా దేశ ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. చైనాతో సంబంధాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కూడా ఆయన విమర్శలు చేశారు. చైనా విషయంలో మోదీ ప్రభుత్వం రాజీ ధోరణిని అనుసరిస్తోందా? అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు.

**'చైనా పాక్‌కు అన్ని విధాలా సహకరించింది'**

2025లో లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలను జైరాం రమేశ్ ప్రస్తావించారు. మే 7 నుంచి 10 వరకు భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణను చైనా ఆయుధ వ్యవస్థలను పరీక్షించుకునే 'లైవ్ ల్యాబ్'గా ఉపయోగించుకుందని ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు చైనా అన్ని విధాలా మద్దతు అందించిందని, తుర్కియే కూడా ఆయుధ సామగ్రిని సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. పాక్ ముందుండి పోరాడుతున్నప్పటికీ, చైనా, తుర్కియే మద్దతుతో భారత్ ఒకేసారి కనీసం ముగ్గురు ప్రత్యర్థులను ఎదుర్కొందని తెలిపారు. పాకిస్థాన్ సైన్యానికి చైనా ఉపగ్రహాల ద్వారా భారత సైనిక మోహరింపులపై సమాచారం అందిందని కూడా రాహుల్ సింగ్ అప్పట్లో పేర్కొన్నట్లు గుర్తు చేశారు.

అయితే తాజాగా అనిల్ చౌహాన్ దీనిపై భిన్నమైన వివరణ ఇచ్చారు. పాకిస్థాన్ వద్ద ఉన్న సైనిక ప్లాట్?ఫామ్?ల్లో దాదాపు 70 నుంచి 80 శాతం చైనా తయారీకి చెందినవేనని తెలిపారు. విదేశీ ఆయుధ వ్యవస్థలను ఒక దేశం కొనుగోలు చేసినప్పుడు వాటి నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక సేవల కోసం ఆయా తయారీ సంస్థల ప్రతినిధులు అక్కడ ఉండటం సాధారణమేనని వివరించారు. యుద్ధ సమయంలో ఆయుధ వ్యవస్థలు పనిచేసేలా చూసే బాధ్యత ఆయా సంస్థలపై ఉంటుందని చెప్పారు. పాకిస్థాన్‌లో చైనా ఆయుధ తయారీ సంస్థల ప్రతినిధులు ఉండటం విషయాన్ని చైనా కూడా అంగీకరించిందని, ఇందులో కొత్త విషయం ఏమీ లేదని చౌహాన్ అన్నారు. ఇదే విధంగా భారత్‌లోనూ రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్‌కు చెందిన ఆయుధ సంస్థల ప్రతినిధులు తమ పరికరాల నిర్వహణ కోసం ఉండే అవకాశం ఉందని వివరించారు.

# రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం

- శ్రీలంక ఆటగాడు సోనాల్ దినుషా అజేయ శతకం
- శ్రీలంకతో డ్రాగా ముగిసిన రెండో టెస్ట్
- టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం
- శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య



ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసాడు. మరోవైపు ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో సోనాల్ దినుషా, టెయిలెండర్ల అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో శ్రీలంక డ్రాతో గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది. 229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది. రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు తగిన ఓవర్లు లేకపోవడంతో.. శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. సోనాల్ దినుషా అజేయ శతకంతో పాటు పసింధు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92), కామిందు మెండిస్(92 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 55), కేశర నువాంత(150 బంతుల్లో 4 ఫోర్లతో 46) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(3/121), రవీంద్ర జడేజా(3/94) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, సారాన్ష్ జైన్ తలో వికెట్ తీసారు. తొలి సెషన్‌లోనే ఫలితం తేలుతుందని భారత్ భావించగా.. సోనాల్ దినుషా, కేశర నువాంత అడ్డుగోడగా నిలిచారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. 32 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరూ.. తొలి సెషన్‌లో 100 పరుగులు జోడించారు. దాంతో శ్రీలంక 329/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో కేశర నువాంత ఔటవ్వడంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో భారత శిభిరంలో ఆశలు చిగురించాయి. కానీ లాహిరు కుమారతో కలిసి సోనాల్ దినుషా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జిడ్డుగా ఆడిన ఈ జోడీ.. భారత బౌలర్ల సహనాన్ని దెబ్బతీసింది. 383/8 స్కోర్‌తో శ్రీలంక టీ బ్రేక్‌కు వెళ్లింది.ఆఖరి సెషన్‌లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించిన శ్రీలంక 400 పరుగుల మార్క్‌ను అందుకుంది. 196 బంతుల్లో దినూషా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 90 బంతులాడిన లాహిరు కుమారను జడేజా ఔట్ చేసినా ఫలితం లేకపోయింది. అసితా ఫెర్నాండో(0 నాటౌట్) కలిసి దినుషా మరో 10 ఓవర్లు ఆడగా.. శ్రీలంక డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ వెంటనే షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. వర్షం అంతరాయం, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం, భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం లోపించడం.. గిల్ సేన విజయాన్ని అడ్డుకున్నాయి.






## రవీంద్ర జడేజా చెత్త రికార్డ్..

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చెత్త రికార్డ్ నమోదు చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ కాలంలో అత్యధిక నోబాల్స్ వేసిన ఆటగాడిగా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. 2021 నుంచి టెస్ట్‌ల్లో జడేజా 88 నోబాల్స్ వేసాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో జడేజా మొత్తం నాలుగు నోబాల్స్ వేసాడు. తొలి ఇన్నింగ్స్‌లో మూడు నోబాల్స్ వేసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో ఒకటి వేసాడు. తొలి టెస్ట్‌లోనూ జడేజా నాలుగునో బాల్స్ వేసాడు. ఇన్నింగ్స్‌కు రెండు చొప్పున నోబాల్స్ సంధించాడు. ఇందులో ఒకటి ధనంజయ డి సిల్వాకు లైఫ్‌లైన్‌గా మారింది. దాంతో టెస్టు క్రికెట్‌లో ఒక స్పిన్నర్ అత్యధిక నో బాల్స్ వేసిన చెత్త రికార్డును జడేజా మూటగట్టుకున్నాడు. జడేజా తర్వాత రెండో స్థానంలో పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ ఉన్నాడు.రెండో టెస్ట్‌లో జడేజాతో సహా భారత బౌలర్లంతా 10 నోబాల్స్ వేసారు. అఫ్గానిస్థాన్(14) తర్వాత అత్యధిక నోబాల్స్ వేసిన జట్టుగా భారత జట్టు అప్రతిష్టను మూటగట్టుకుంది.ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు.తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది.

# కొత్త గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా డ్రీమ్11




డ్రీమ్11 కొత్త దారిలోకి అడుగుపెట్టింది. రియల్ మనీ గేమింగ్, నగదు బహుమతులతో కూడిన ఫాంటసీ స్పోర్ట్స్ కాంటెస్టులను ఆపేసిన ఏడాది తర్వాత, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను కలిపే ప్లాట్‌ఫామ్‌గా మారిందని పీటీఐ వెల్లడించింది. ఇకపై డ్రీమ్11లో ప్రైజ్ మనీ ఉండదు. స్పోర్ట్స్ కంటెంట్, లైవ్ స్ట్రీమింగ్, స్కోర్లు, స్టాట్స్, కమ్యూనిటీ ఫీచర్లు, స్పోర్ట్స్ అనుభవాలు, సోషల్ కాంటెస్టులపై సంస్థ దృష్టి పెట్టనుంది. గురువారం డ్రీమ్11 ఈ మార్పును ప్రకటించింది. ఇంతకాలం ఫాంటసీ స్పోర్ట్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టిన ప్లాట్‌ఫామ్, ఇప్పుడు గ్లోబల్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌గా మారింది.

కొత్త ప్లాట్‌ఫామ్‌లో ఏఐకి ప్రధాన పాత్ర ఉండనుంది. యూజర్లు ఇష్టపడే స్పోర్ట్స్, లీగ్‌లు, టీమ్‌లు, ప్లేయర్ల ఆధారంగా వారికి నచ్చే కంటెంట్, అనుభవాలను వ్యక్తిగతంగా అందించనుంది. ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను ఒక కమ్యూనిటీగా కలపడం ద్వారా 'మేక్ స్పోర్ట్స్ బెటర్' అనే తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని డ్రీమ్11 చెబుతోంది. కొత్త డ్రీమ్11లో ఒక్క క్రికెట్‌కే పరిమితం కాకుండా పలు రకాల స్పోర్ట్స్ అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తున్నారు. యూజర్లు లైవ్ మ్యాచ్‌లు చూడొచ్చు. గత వారాంతంలో జరిగిన రేస్‌ను ఫాలో అవ్వొచ్చు. స్టాటిస్టిక్స్, కామెంటరీ చూడొచ్చు. స్పోర్ట్స్‌కు సంబంధించిన ప్రత్యేక అనుభవాలను బుక్ చేసుకోవచ్చు. స్నేహితులు, ఇతర స్పోర్ట్స్ అభిమానులతో కలిసి సోషల్ కాంటెస్టుల్లో పాల్గొనొచ్చు.డ్రీమ్11 సీఈఓ వైభవ్ కోకల్ మాట్లాడుతూ, తమ 30 కోట్ల మంది యూజర్లతో పనిచేసిన అనుభవం ద్వారా స్పోర్ట్స్ అభిమానులు కేవలం ఆటను మాత్రమే కోరుకోవడం లేదని చెప్పారు. వాళ్లు ఒక కమ్యూనిటీలో భాగంగా ఉండాలని కూడా కోరుకుంటున్నారని తెలిపారు. "దేశంలోని అత్యుత్తమ టెక్ టాలెంట్ మద్దతుతో, ఇండియాలో తయారై ప్రపంచం కోసం రూపొందించిన ఏఐ-ఫస్ట్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని ఆయన చెప్పారు. గత ఏడాది ఆగస్టులో పార్లమెంట్ 'ప్రొమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025'ను ఆమోదించిన తర్వాత డ్రీమ్11 తన రియల్ మనీ గేమింగ్ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత ప్లాట్‌ఫామ్‌లో డబ్బులు చెల్లించి ఆడే కాంటెస్టులన్నింటినీ ఆపేసింది. కొత్త చట్టానికి అనుగుణంగా ఉచితంగా ఆడే సోషల్ గేమింగ్ మోడల్‌కు మారింది. మొత్తంగా చూస్తే, డ్రీమ్11 ఇకపై డబ్బులు గెలుచుకునే ఫాంటసీ స్పోర్ట్స్ యాప్‌గా కాకుండా, లైవ్ స్పోర్ట్స్, కంటెంట్, స్టాట్స్, కమ్యూనిటీ, సోషల్ కాంటెస్టులు, స్పోర్ట్స్ అనుభవాలను ఒకే చోట అందించే గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా తన కొత్త ప్రయాణాన్ని కొనసాగించనుంది.

# అభిషేక్ శర్మపై వేటు?

భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి  వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్గానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది.భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్గానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. జింబాబ్వే పర్యటనతో పాటు, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాట్‌తో రాణించడంలో విఫలమయ్యాడు. దీంతో అఫ్గానిస్తాన్ సిరీస్ నుంచి అతడిని తప్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తోంది. అభిషేక్ శర్మ స్థానంలో కేరళకు చెందిన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న శాంసన్‌ను జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజా సిరీస్‌తో అతను మళ్లీ మెయిన్ స్క్వాడ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌కు పునరాగమనం చేయడం ఖాయం. అయితే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 2022 తర్వాత భువనేశ్వర్ భారత్ తరఫున మళ్లీ మ్యాచ్ ఆడలేదు. యితే ఐపీఎల్ 2026లో ఆర్సీబీ తరఫున అద్భుత స్వింగ్ బౌలింగ్‌తో మెరిసిన భువీ, ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లోనూ నిలకడగా వికెట్లు తీస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. త్వరలోనే బీసీసీఐ పూర్తి జట్టు వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.



# ఐసీసీపై మండిపడ్డ స్టీవ్ వా



వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. ఐసీసీ తీసుకున్న ఈ ఫార్మాట్ మార్పు నిర్ణయంపై ఇప్పటికే అసోసియేట్ దేశాలైన స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆగస్టులో ఈ రెండు బోర్డులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఐసీసీ నిర్ణయం అసోసియేట్ దేశాల క్రికెట్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని, ఇటీవల కాలంలో ఆటను విస్తరించడానికి సాధించిన పురోగతిని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. "టోర్నమెంట్ ప్రారంభానికి 18 నెలల కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో, పురుషుల 50 ఓవర్ల ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియ, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఐసీసీ భారీ మార్పులు చేయడం తీవ్ర నిరాశ కలిగించింది. క్రికెట్ తన పరిధిని విస్తరించుకోవాలని, కొత్త ప్రేక్షకులను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో.. ఎదుగుతున్న చిన్న దేశాలకు అవకాశాలు తగ్గించడం అంతర్జాతీయ క్రీడా ప్రపంచానికి చాలా తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.

# సంపాదకీయం

## నిరుద్యోగితే అసలు సమస్య

విద్యార్థుల ఆందోళన నాటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసి కొన్ని వారాలైంది. పరీక్షా సంస్కరణల కోసం విద్యార్థులు చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించింది, స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని దీన్ని ప్రతిధ్వనిస్తూ, భారత డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాన్ని వినియోగించుకుని పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తామని ప్రకటించారు. ఇది విద్యార్థులకు ఎందుకు స్వాగతించదగినదో ఎంఓఎస్‌పీఐ సర్వే గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఒక భారత కుటుంబం తన పిల్లల విద్యపై చేసే ఖర్చులో ప్రయివేట్ కోచింగ్ వాటా 2018లో 12.5 శాతం ఉంటే, ఇప్పుడు 16 శాతానికి పెరిగింది. ఉన్నత మాధ్యమిక స్థాయిలో -అంటే విద్యార్థి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో ఈ వాటా బడ్జెట్‌లో దాదాపు నాలుగోవంతుకు చేరుతుంది. అయితే, చౌక కోచింగ్ ఇచ్చినంత మాత్రాన పరిమిత ప్రయోజనమే ఉంటుంది, ఎందుకంటే నాణ్యమైన వృత్తి విద్య కొన్ని సంస్థలకే పరిమితమై ఉంది. ఉదాహరణకు, ఈ ఏడాది వైద్య విద్య ప్రవేశ పరీక్షకు 22 లక్షలకుపైగా అభ్యర్థులు హాజరవగా, అందుబాటులో ఉన్నది కేవలం 1.4 లక్షల అండర్ గ్రాడ్యుయేట్ సీట్లు మాత్రమే. అందులోనూ టాప్ 50 కాలేజీల్లో 10,000 కంటే తక్కువ సీట్లే ఉన్నాయి. ఇంజినీరింగ్ కాలేజీలకు జరిగే జేఈఈ పరిస్థితి కూడా ఇదే. బహుశా అందుకే, 2011లో అఖిల భారత ఉన్నత విద్యా సర్వే మొదలైనప్పటి నుంచి తొలిసారిగా, 2023-24లో అండర్ గ్రాడ్యుయేట్ నమోదు 93,322 తగ్గింది -ముఖ్యంగా యువకుల్లో. ఉత్తరప్రదేశ్‌లో ఈ క్షీణత అత్యంత తీవ్రంగా కనిపించింది, అక్కడ అండర్‌గ్రాడ్యుయేట్ నమోదు 1.53 లక్షలు తగ్గగా, డిప్లొమా నమోదు 1.38 లక్షలు పెరిగింది. ఆవర్తన శ్రామిక శక్తి సర్వే (పీఎల్ఎఫ్ఎస్) డేటా విశ్లేషణ ప్రకారం, 2025లో 15-29 ఏళ్ల మధ్య వయసున్న ప్రతి వందమంది గ్రాడ్యుయేట్లలో కేవలం 26 మందికి మాత్రమే క్రమమైన జీతం గల ఉద్యోగం ఉంది. ఒప్పందం, సామాజిక భద్రతతో కూడిన జీతంగల ఉద్యోగం కేవలం నలుగురికి మాత్రమే ఉంది. అంటే, యువత ఉపాధి సంక్షోభానికి రెండు కోణాలున్నాయి. ఉద్యోగాలకు సిద్ధమయ్యే దశలోనూ, అసలైన ఉద్యోగాల్లోనూ. కేవలం ఉచిత కోచింగ్ ఈ రెండింటిలో దేన్నీ పరిష్కరించలేదు.

ప్రభుత్వం 6-6.5 శాతం వృద్ధి రేటును గొప్పగా ప్రచారం చేస్తున్నా, భారత ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణాత్మక సమస్యలు ఇప్పుడు విస్మరించలేనంత స్పష్టంగా కనిపిస్తున్నాయి. భారత కాలేజీ గ్రాడ్యుయేట్లను ఉద్యోగాల్లోకి తీసుకునేందుకు అత్యంత అనువైన రంగం తయారీ రంగమే అయినా, స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో దీని వాటా ఇప్పటికీ ఆరో వంతు స్థాయిలోనే ఉంది. ప్రభుత్వం చాలాకాలంగా వాగ్దానం చేస్తున్న నాలుగోవంతుకు ఏమాత్రం దగ్గరగా లేదు. 2015 వరకూ దశాబ్దాలుగా స్థిరంగా 17 శాతం వద్ద ఉన్న తయారీ రంగం జీడీపీ వాటా, ఆ తర్వాత ఐదేళ్లలో పడిపోయి 2022 నాటికి 13 శాతానికి చేరింది -'మేక్ ఇన్ ఇండియా' ప్రచారం ఉన్నప్పటికీ. తయారీ రంగంలో ఉపాధి వాటా కూడా 2012లో 12.8 శాతం నుంచి 2024 నాటికి 11.5 శాతానికి పడిపోయింది, 2021 వరకూ తయారీ రంగంలో ఉపాధి సంపూర్ణ సంఖ్యలోనే తగ్గింది -స్వాతంత్ర్యానంతర భారత చరిత్రలో ఇదే మొదటిసారి. అదే సమయంలో, కార్పొరేట్ పెట్టుబడులు 2007-08లో జీడీపీలో 17.3 శాతం ఉంటే, 2024-25 నాటికి 10.3 శాతానికి పడిపోయాయి. 2019లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించినా ప్రైవేటు రంగం స్పందించలేదు. దీనికితోడు, 2024-25లో కార్పొరేట్ లాభాలు 22 శాతానికిపైగా వృద్ధి చెందినా, ఉపాధి కేవలం 1.5 శాతమే పెరగడం, వృద్ధి ఫలాలు కంపెనీలకు మాత్రమే దక్కుతున్నాయని, కార్మికులకు కాదని స్పష్టం చేస్తోంది. 2025-26లో యువత నిరుద్యోగిత రేటు 16.2 శాతానికి చేరగా, మహిళా యువత నిరుద్యోగిత (20.7శాతం) పురుష యువత నిరుద్యోగిత (14.6 శాతం) కంటే గణనీయంగా అధికంగా ఉంది. 2023లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన ఏడాదిలోపే శాశ్వత, జీతం గల ఉద్యోగం సంపాదించిన పురుష గ్రాడ్యుయేట్లు 7 శాతం కంటే తక్కువే ఉండటం, డిగ్రీ ఇకపై మధ్యతరగతిలోకి ప్రవేశానికి హామీ ఇవ్వడం లేదని స్పష్టం చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు స్పష్టంగానే ఉన్నాయి -పారిశ్రామిక సామర్థ్యంలో ప్రభుత్వ పెట్టుబడి, దేశీయ రక్షణకంటే ఎగుమతి పనితీరుతో క్రమశిక్షణతో కూడిన పరిశ్రమకు మద్దతు, ఉద్యోగాలు కల్పించే మధ్యస్థాయి కంపెనీలను ముఖ్యంగా ప్రభావితం చేస్తున్న ఎంపిక చేసుకుని లక్ష్యంగా చేసుకుంటున్నట్టు కనిపించే నియంత్రణ, అమలు తీవ్రతను తగ్గించడం. వియత్నాం వంటి దేశాలు నిరూపించినట్టుగా, ఈ మార్గం అవసరమైన స్థాయిలో యువతకు ఉద్యోగాలు అందించే మెరుగైన అవకాశాన్ని కలిగి ఉంది. ఇప్పటికే 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న 36.7 కోట్ల మంది భారత్‌లో ఉన్నారు, ఈ యువతను ఉత్పాదకంగా ఉపాధిలో నియమించకపోతే, వారు సామాజిక, ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంది. ప్రతి నెలా దాదాపు 10 లక్షల మంది యువత శ్రామిక శక్తిలో చేరుతుండగా, భారత జనాభా డివిడెండ్ దీర్ఘకాలిక ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉంది. వ్యవసాయం నుంచి నేరుగా అధిక-నైపుణ్యం అవసరమైన సేవా రంగాలకు దూకేసిన భారత ఆర్థిక వ్యవస్థ, శ్రమ-ఆధారిత తయారీ దశను దాటవేసింది - ఇది సంపదను సృష్టిస్తుందేమో కానీ, సగటు గ్రాడ్యుయేట్‌ను వెనుకబడేలా చేస్తోంది.

ఉచిత కోచింగ్ ప్రకటన మంచి ఉద్దేశమే కావొచ్చు. కాని అసలైన సవాలు, పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత, డిగ్రీ చేతిలో ఉన్న తర్వాత కూడా నాణ్యమైన ఉద్యోగాల కొరత తప్పదు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ధృవీకరణలు పొందిన యువతలో సగంమందికి కూడా ఉద్యోగం కల్పించలేకపోయింది. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం భారీ బడ్జెట్ కేటాయింపుల ఉన్నప్పటికీ దాదాపు శాశ్వత ఉద్యోగాలేమీ కల్పించలేదు. ఇలాంటి పథకాల వైఫల్యం, సమస్య మూలాన్ని నిర్మాణాత్మక ఆర్థిక సంస్కరణల లేమిని పరిష్కరించకుండా, ఉపరితల పరిష్కారాలతో సరిపెట్టుకునే ధోరణిని బహిర్గతం చేస్తుంది. పరీక్షా సంస్కరణలు, ఉచిత కోచింగ్ వంటివి రాజకీయంగా ఆకర్షణీయంగా కనిపించొచ్చు, కానీ అవి యువత అసలైన ఆగ్రహానికి మూలకారణం కాదు. ఉద్యోగాల కొరతే అసలైన సమస్య. తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, కార్పొరేట్ పెట్టుబడులను ప్రోత్సహించడం, ఎగుమతి ఆధారిత పారిశ్రామిక విధానాన్ని అనుసరించడం వంటి దీర్ఘకాలిక నిర్మాణాత్మక సంస్కరణలు లేకుండా, భారత యువత సంక్షోభానికి శాశ్వత పరిష్కారం లభించదు. పరీక్షా వ్యవస్థను సంస్కరించడం మంచిదే, కానీ ఆ తర్వాత ఉద్యోగం లేకపోతే, ఆ సంస్కరణ కూడా అసంపూర్ణంగానే మిగిలిపోక తప్పదు!

## పనికొచ్చే పలుకు



## జీవనశైలిని ఇలా మార్చుకోండి

సూర్యోదయానికి ముందే నిద్రలేవడం, పచ్చని గడ్డిపై నడవడం, రోజూ 10 వేల అడుగులు వేస్తూ ఎక్కువ సమయం ప్రకృతిలో గడపడం, కుటుంబ సభ్యులు, స్నేహితులకు సమయాన్ని కేటాయించగలగడం వంటివి జీవనశైలిలో చేర్చుకోండి. జీవించడం అంటే అలసిపోయేలా నిరంతరం శ్రమించడం కాదు. మనకు సరికొత్త ఉత్సాహాన్ని, శక్తినిచ్చే వాతావరణాన్ని సృష్టించుకోవడం. ఆధునిక జీవితంలో మనం విజయాన్ని కేవలం పని గంటలతో, సాధించిన లక్ష్యాలతో మాత్రమే కొలుస్తుంటాం. తెల్లవారుజాము వరకూ మేల్కొని పనిచేయడం, వారాంతాల్లోనూ ల్యాప్‌టాప్ ముందు కూర్చోవడం, ప్రకృతితో సంబంధం లేకుండా నాలుగు గోడల మధ్యే గడిపేయడం.. ఇలాంటి జీవనశైలి మనల్ని విజయవంతం చేస్తుందని అనుకుంటాం. కానీ వాస్తవానికి ఇది మెల్లమెల్లగా మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కబళిస్తుంది. అలసట, ఏకాగ్రత లోపం, నిద్రలేమి, సంబంధాల్లో దూరం -ఇవన్నీ తప్పుడు జీవనశైలి తెచ్చిపెట్టే దుష్ఫలితాలు.

ప్రఖ్యాత అమెరికన్ వాస్తుశిల్పి ఫ్రాంక్ లాయిడ్ రైట్ ఒక అందమైన మాట చెప్పారు. Study nature, love nature, stay close to nature. It will never fail you. అంటే, ప్రకృతిని అధ్యయనం చేయండి, ప్రేమించండి, దానికి దగ్గరగా ఉండండి. అది మిమ్మల్ని ఎప్పటికీ నిరాశపరచదు. ఈ మాటల్లో ఒక లోతైన సత్యం దాగివుంది. మనం ఎంత ఆధునికంగా, సాంకేతికంగా ముందుకెళ్లినా, మన శరీరం ఇప్పటికీ ప్రకృతి లయలతోనే జతకట్టి ఉంది. సూర్యోదయ కాంతి మన శరీర గడియారాన్ని (సర్కేడియన్ రిథమ్‌ను) సరిచేస్తుంది. పచ్చదనం మన కళ్లకు, మనసుకు విశ్రాంతినిస్తుంది, నడక మన కండరాలను, గుండెను బలోపేతం చేస్తుంది. శాస్త్రీయంగా చూసినా, ఉదయం సూర్యరశ్మిలో నడవడం వల్ల విటమిన్ డి ఉత్పత్తి పెరగడంతోపాటు, మెలటోనిన్ హార్మోన్ సక్రమంగా విడుదలై మంచి నిద్ర లభిస్తుంది. పచ్చని ప్రదేశాల్లో గడపడంవల్ల ఒత్తిడి హార్మోన్ కార్టిజాల్ స్థాయి తగ్గుతుందని, రక్తపోటు నియంత్రణలో ఉంటుందని పరిశోధనలు నిరూపించాయి. రోజుకు 10 వేల అడుగులు నడవడం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాదు, మానసిక స్థితిని కూడా సానుకూలంగా మారుస్తుంది. ఇక కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపే సమయం, మనలో ఆత్మీయత, భద్రతా భావనను పెంచి డిప్రెషన్‌వంటి సమస్యలను దూరం చేస్తుంది.

ఈ జీవనశైలి మార్పులను మన దైనందిన జీవితంలో ఎలా చేర్చుకోవచ్చో ఆలోచిద్దాం. మొదటిది, అలారం సమయాన్ని 30 నిమిషాలు ముందుకు జరిపి, ఆ సమయాన్ని ప్రశాంతంగా సూర్యోదయాన్ని ఆస్వాదించడానికి కేటాయించండి. రెండోది, వారానికి కనీసం రెండుసార్లు పార్కుకో, తోటకో వెళ్లి చెప్పులు లేకుండా పచ్చిక మీద నడవండి. దీన్నే 'గ్రౌండింగ్' అంటారు. ఇది శరీరంలో ఒత్తిడిని తగ్గించే సహజ పద్ధతి. మూడోది, రోజువారీ నడకను ఒక అలవాటుగా మార్చుకోండి. మెట్లు ఎక్కడం, కారుకు బదులు నడవడం వంటి చిన్న మార్పులతో మొదలుపెట్టవచ్చు. నాలుగోది, వారంలో కనీసం ఒక భోజనాన్ని ఫోన్‌లు పక్కనపెట్టి, కుటుంబంతో కలిసి తినండి. ఈ చిన్న అలవాటు సంబంధాలను గణనీయంగా బలపరుస్తుంది. గుర్తుంచుకోండి -జీవితం అంటే ఎవరు ఎక్కువ గంటలు పనిచేశారో పోటీ పడటం కాదు. ప్రకృతికి దగ్గరగా జీవిస్తూ, ప్రియమైనవారితో సమయం గడుపుతూ, మీ శరీరానికి, మనసుకు కావాల్సిన విశ్రాంతిని ఇవ్వడమే నిజమైన జీవన కళ. ఈ చిన్న చిన్న మార్పులే, దీర్ఘకాలంలో మీకు ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని అందిస్తాయి.

# వర్షాభావంపై సర్కారు యుద్ధం!




ఈ ఏడాది వర్షాభావంతో ఏపీ పెద్ద సవాలు ఎదుర్కొంటోంది. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఏకంగా 51 శాతం వర్షం తక్కువగా కురిసింది. దేశం మొత్తంమీద చూస్తే జూన్ 1 నుంచి ఆగస్టు 25 వరకు వర్షపాతం 13 శాతం తక్కువగా ఉంటే, ఏపీలో మాత్రం పరిస్థితి దారుణంగా ఉంది. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లాల్లోనూ వర్షం తక్కువగానే కురిసింది. అందులో మూడు జిల్లాల్లో అయితే మరీ ఎక్కువ లోటు నమోదైంది. వాస్తవానికి, జూన్‌లో మామూలుగా 79.24 మిల్లీమీటర్ల వర్షం రావాల్సి ఉండగా, కేవలం 29.17 మిల్లీమీటర్లే వచ్చింది. అంటే 63 శాతం తక్కువ. రాష్ట్ర జనాభాలో 62 శాతానికి సేద్యమే ఆధారం. కాబట్టి, రైతులను, పల్లె ప్రజల జీవనోపాధిని కాపాడటమే ప్రభుత్వానికి ఇప్పుడు అతిపెద్ద ప్రాధాన్యతగా మారింది. సమస్యను ముందుగానే పసిగట్టిన ప్రభుత్వం, ఫిబ్రవరిలోనే.. అంటే రెయినీ సీజన్‌కు ముందే వాతావరణ శాఖ, పరిశోధనా సంస్థలతో కలిసి ప్రణాళికలు మొదలుపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,489 రైతు సేవా కేంద్రాలను పరిశీలించి, ఏ ప్రాంతంలో ఎంత ప్రమాదముందో ముందే గుర్తించారు. వీటిలో 1,357 కేంద్రాలను ఎక్కువ ప్రమాదమున్న ప్రాంతాలుగా, 2,077 కేంద్రాలను మధ్యస్థ ప్రాంతాలుగా వర్గీకరించారు. వర్షాలపైనే ఎక్కువగా ఆధారపడే రాయలసీమ, పాత ప్రకాశం-నెల్లూరు ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని ముందే అంచనా వేశారు. ఎక్కడ ఎంత నీరుందో చూసి, దానికి తగినట్టుగా ప్రభుత్వం నాలుగు రకాల చర్యలు తీసుకుంది. ఇదే ఈ మొత్తం ప్రణాళికలో అత్యంత కీలక భాగం. నీటిపారుదల సౌకర్యమున్న ప్రాంతాల్లో పంటలు వేసే సమయాన్ని ముందుకు జరిపి, నీటిని పొదుపుగా వాడేలా చూశారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో మాత్రం, నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి పంట బదులు, తక్కువ నీటితో పండే పంటలు వేయమని రైతులను ప్రోత్సహించారు. దీంతోపాటు, ప్రకృతి వ్యవసాయం, వర్షాలు రాకముందే పొడి నేలలో విత్తనాలు వేయడం, విత్తనాలకు ప్రత్యేక పూత పూయడం వంటి కొత్త పద్ధతులను విస్తృతంగా అమలు చేశారు. ఇప్పటివరకు ఇలాంటి పద్ధతులను 18.20 లక్షల ఎకరాల్లో అమలు చేశారు. వ్యవసాయ కుంటలు తవ్వడం, నేలలో తేమను కాపాడుకోవడం, రకరకాల పంటలు వేయడం, పశువులకు మేత దొరికేలా చూడటం వంటి చర్యలను కూడా ప్రభుత్వం ప్రోత్సహించింది. పంటల బీమా విషయంలో అయితే గత ఏడాదితో పోలిస్తే భారీ పురోగతి కనిపించింది. గత ఖరీఫ్‌లో 7.83 లక్షల హెక్టార్లకు మాత్రమే బీమా ఉంటే, ఈసారి అది 16.39 లక్షల హెక్టార్లకు రెట్టింపైంది. దీంతో పంటల బీమాలో ఏపీ దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. రైతులకు మరింత సమయం ఇవ్వడానికి, ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో నమోదు చేసుకునే గడువును ఆగస్టు 31 వరకు పొడిగించారు.

'రైతన్న మీకోసం' పేరుతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం కింద, వేర్వేరు శాఖలకు చెందిన అధికారుల బృందాలు 18,513 గ్రామాల్లో ప్రతి పొలాన్నీ విడివిడిగా పరిశీలిస్తున్నాయి. మొత్తం 2.74 కోట్ల పొలాలను సర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 96.91 శాతం పూర్తయింది. ఇది ఎంత వేగంగా, ఎంత విస్తృతంగా ఈ సర్వే జరుగుతోందో చూపిస్తుంది. "చాలా పంటలు ఇప్పటికీ మామూలు స్థితిలోనే ఉన్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మాత్రమే పంటలపై ఒత్తిడి కనిపిస్తోంది" అని వ్యవసాయ అధికార్లు చెబుతున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 20.35 లక్షల హెక్టార్లలో పంటలు వేయగా, గత ఏడాది ఇదే సమయానికి 25.63 లక్షల హెక్టార్లలో వేశారు. ఇది వ్యవసాయ పనులు తగ్గిపోయాయనడానికి సంకేతం కాదని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పప్పుధాన్యాలు, ఇతర పంటలవైపు ప్రణాళికాబద్ధంగా మళ్లడమేనని అధికార్లు అంటున్నారు. వరి సాగు 11.7 లక్షల హెక్టార్లనుంచి 10.3 లక్షల హెక్టార్లకు తగ్గగా, పప్పుధాన్యాల సాగు 2.1 లక్షల నుంచి 2.6 లక్షల హెక్టార్లకు పెరగడం ఇందుకు నిదర్శనం.

ఈ మొత్తం సన్నద్ధత వెనుక, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందునుంచే వేసిన బలమైన పునాది ఉంది. నీటి భద్రత లేకుండా ఏ రంగమూ అభివృద్ధి చెందదని నమ్మే ఆయన, ఏప్రిల్ 6నే అనంతపురం జిల్లా యాడికిలో 'జలధార' పేరట వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభించారు. చెరువుల్లో పూడిక తీయడం, కాలువలు బాగుచేయడం, భూగర్భ జలాలను పెంచడం, నీటిని పొదుపుగా వాడటం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. "ప్రతి ఎకరాకూ నీరు, ప్రతి రైతుకూ భరోసా" అన్నదే దీని నినాదం. ఇందులో 60 వేల మంది నీటి వినియోగదారుల సంఘాల సభ్యులు పాల్గొంటున్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయిన 5,697 గ్రామాలను ముందే గుర్తించి, చెరువులు నింపడం ద్వారా నీటి మట్టాన్ని కనీసం 1.5 మీటర్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్నమయ్య జిల్లాలో విజయవంతమైన 'జలధార' ప్రాజెక్టు స్ఫూర్తితో, వాగులు, వంకలు, నీటి వనరులను అనుసంధానించి నీటిని ఎక్కువగా నిల్వ చేసుకోవాలని, వరదలను నివారించాలని కూడా ఆయన సూచించారు. ఉపగ్రహ చిత్రాలు, హైడ్రలాజికల్ మ్యాపింగ్‌ను ఉపయోగించి శాస్త్రీయంగా ప్రణాళికలు వేయాలని, నీటి వినియోగదారుల సంఘాలు 'వాటర్ బడ్జెట్‌లు', 'వాటర్ ఆడిట్‌లు' తయారు చేయాలని కూడా ఆదేశించారు.

రాయలసీమలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండటంతో చిరుధాన్యాలు, పప్పుధాన్యాల వంటి తక్కువ నీటితో పండే పంటలవైపు మళ్లాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్‌వంటి అత్యవసర సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర, జాతీయ విపత్తు నిధుల నుంచి ఇప్పటికే నిధులు విడుదల చేయడం, ప్రభుత్వం విపత్తు నిర్వహణపై ఎంత సీరియస్‌గా ఉందో చూపిస్తుంది.

దీర్ఘకాలిక పరిష్కారంగా, 2026 నుంచి 2028 మధ్య 36 నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం కాలపరిమితితో కూడిన ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో 25 పెండింగ్ ప్రాజెక్టులు, కొత్తగా గుర్తించిన 11 ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రధాన డెల్టా ప్రాంతాలకు నీటి విడుదల తేదీలను ముందే ప్రకటించే 'వాటర్ క్యాలెండర్'ను తొలిసారిగా ప్రవేశపెట్టాలని కూడా నిర్ణయించారు. రాయలసీమ కరువు ప్రాంతాలకు హంద్రీ-నీవా సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులు, ఉత్తరాంధ్రకు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి సరఫరా కీలకంగా మారనున్నాయి. మైక్రో ఇరిగేషన్ (బిందు సేద్యం) రంగంలో ఇప్పటికే దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామని, రూ.1,031 కోట్లు ఖర్చు చేసి బిందు సేద్యం విస్తరించడం వల్లే రాయలసీమ ఉద్యాన వన రంగానికి కేంద్రంగా మారిందని, ఈ రంగంలోనూ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నామని సీఎం నాయుడు గతంలో పేర్కొన్నారు. మొత్తంమీద చూస్తే, వర్షాలు లేకపోయినా, ముందుచూపుతో కూడిన ప్రణాళిక, శాస్త్రీయ పద్ధతులు, సకాలంలో తీసుకున్న నిర్ణయాల ద్వారా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. ఇలాంటి పటిష్టమైన స్పందన, భవిష్యత్తులో ఇలాంటి వర్షాభావ పరిస్థితులు మళ్లీ వచ్చినా, రైతులకు, రాష్ట్ర ఆహార భద్రతకు రక్షణ కవచంలా పనిచేస్తుంది. ■




క్రమశిక్షణ గల వ్యక్తి పని చేయడానికి సరైన మూడ్ కోసం వేచి చూడడు. అలసటగా ఉన్నా, అయోమయంలో ఉన్నా, విసుగు అనిపించినా ముందుకు సాగుతాడు. ప్రేరణ అనేది ప్రయాణాన్ని ప్రారంభించడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కానీ ఆ ఉత్సాహం తగ్గిన తర్వాత కూడా మిమ్మల్ని గమ్యం వైపు నడిపించేది కేవలం క్రమశిక్షణ మాత్రమే. ప్రేరణ వెలుగులా వచ్చిపోతుంది, కానీ క్రమశిక్షణ మాత్రం నిశ్చలంగా వెలుగుతూనే ఉంటుంది. మూడ్ కోసం ఎదురుచూసేవారు గమ్యానికి దూరంగానే ఉండిపోతారు, అలసటనూ దాటి అడుగేసేవారే చివరికి విజయాన్ని అందుకుంటారు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

## కోతి చెవి సాహస విన్యాసం



చైనాలోని గుయిజౌ ప్రావిన్స్‌లో ఉన్న 'హౌర్' (కోతి చెవి) సింక్‌హోల్ ప్రకృతి వైపరీత్యం కాదు, ఒక అద్భుత ప్రకృతి సృష్టి - 300 మీటర్ల వ్యాసంతో, 280 మీటర్ల లోతుతో ఏర్పడిన ఈ కార్స్ట్ సింక్‌హోల్ చైనాలోని అత్యంత మనోహరమైన ప్రకృతి వింతల్లో ఒకటి. దీన్ని మరింత ప్రత్యేకంగా అనుభవించేందుకు, ఫిబ్రవరి 6, 2026న ఇక్కడ ఒక వినూత్నమైన జిప్‌లైన్ వ్యవస్థను ప్రారంభించారు. సాధారణ జిప్‌లైన్‌లకు భిన్నంగా, ఇది సొరంగం ఆకారంలో ఉండే ప్రత్యేక ట్రాక్‌పై నడుస్తుంది, సందర్శకులు పూర్తి భద్రతా పరికరాలు ధరించి, హ్యాండిల్స్ పట్టుకుని 280 మీటర్ల ఎత్తు నుంచి గాలిలో దూసుకెళ్తారు. ఇది ఆన్‌లైన్‌లో వైరల్ అయిన మొబైల్ గేమ్ 'టెంపుల్ రన్'ను నిజ జీవితంలో అనుభవించినట్టుగా ఉంటుందని నెటిజన్లు పోల్చుతున్నారు. కొండల మధ్య దూసుకెళ్తూ, కింద పచ్చని అడవులు, దాగివున్న జలపాతాలను చూస్తూ సాగే ఈ ప్రయాణం, "రిస్క్ లేని సాహసం"గా పేరొందింది - సురక్షితమే అయినా, అడ్రినలిన్‌ను పెంచేలా ఉంటుంది. టిక్‌టాక్‌లో 200 కోట్లకు పైగా వీక్షణలు సాధించిన ఈ వీడియోలు, సాహసప్రియులను చైనా వైపు ఆకర్షిస్తున్నాయి.




# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్


## భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది.ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది. 'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ.100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.

# సినిమా విజయం చిత్ర పరిశ్రమలో అందరిది

## ఇరుడముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు







ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. 'ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి' అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు' అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్హమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ

## రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం



టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.




# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com